Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 142 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 11 - 12 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## దీపావళికి ప్రపంచ వ్యాప్త గుర్తింపు : ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :** దీపావళిని యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాలో చేర్చడాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ పండుగకు ఈ హోదా దక్కడంపై భారతదేశ ప్రజలతోపాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలంతా సంభ్రమాశ్చర్యాలకు గురయ్యార న్నారు. ఈ పండుగ.. ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి పొందిందని ఆయన పేర్కొన్నారు. దీపావళికి ఈ హోదా దక్కడంపై బుధవారం తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రధాని మోదీ స్పందించారు. ఈ పండగ.. మన సంస్కృతి, నైతికతలకు చాలా దగ్గరి సంబంధం కలిగి ఉంటుందని చెప్పారు. ఇది మన నాగరికతకు ఆత్మ వంటి దని ఆయన అభివర్ణించారు. ఈ పండగ ధర్మాన్ని ప్రతిబింబి స్తుందని తెలిపారు. యునెస్కో జాబితాలో చేరడం వల్ల ఈ పండగ మరింత ప్రజాదరణ పొందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. శ్రీరాముడి ఆదర్శాలు మనకు శాశ్వతంగా మార్గనిర్దేశనం చేస్తుంటాయని ఈ సందర్భంగా ప్రధాని మోదీ వివరించారు.

**ప్రతీ భారతీయుడికి గర్వకారణం: ఉపరాష్ట్రపతి**

ఇక ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు ఎంతో ఇష్టంగా జరుపుకునే దీపావళి పండగను యునెస్కో వారసత్వ జాబితాలో చేర్చడంపై భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సైతం స్పందించారు. ఈ పండగను యునెస్కో జాబితాలో చేర్చడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ పండగ ప్రపంచ గుర్తింపు పొందిందని తెలిపారు. ఇది ప్రతీ భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు. దీపావళి కేవలం ఒక పండుగ మాత్రమే కాదని.. ఇది దేశాన్ని ఏకం చేసే.. ప్రపంచ వ్యాప్తంగా ప్రతిధ్వనించే నాగరికతగా ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అభివర్ణించారు. భారతదేశ బహుళ సాంస్కృతిక, సామాజిక ఐక్యతను సూచిస్తుందని తెలిపారు. అదే సమయంలో ఆశ, సామరస్యం, చీకటిపై కాంతి విజయంగా దీపావళిని ఆయన పేర్కొన్నారు. అధర్మంపై ధర్మం యొక్క శాశ్వత సందేశాన్ని కూడా ఇది తెలియజేస్తుందని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ వివరించారు.

**ఇది సంతోషకర సమయం: రణధీర్ జైశ్వాల్**

వెలుగులు విరజిమ్మే పండగ దీపావళి.. యునెస్కో వారసత్వ జాబితాలో స్థానం సంపాదించుకోవడంపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పందించారు. ఇది సంతోషకరమైన సమయమని ఆయన పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ఈ పండగ ఒక ప్రతీక అని తెలిపారు. అంతేకాదు శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన రోజు కూడా ఈ రోజే. ఈ నేపథ్యంలో ఈ పండగను ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ గుర్తు చేశారు. దేశ రాజధాని న్యూఢిల్లీ లోని ఎర్రకోటలో బుధవారం జరిగిన కీలక సమావేశంలో యునెస్కో ప్రతినిధులు.. దీపావళిని వారసత్వ జాబితాలో చేర్చాలని నిర్ణయం తీసుకున్నారు. భారత్‌కు చెందిన 15 అంశాలు ఇప్పటికే వారసత్వ గుర్తింపు ఇచ్చిన విషయం విదితమే. ఈ జాబితాలో కుంభమేళా, కోల్‌కతా దుర్గా పూజ, గుజరాత్‌లోని గర్బా నృత్యం, యోగా, వేద పఠనం, రామలీల చోటు దక్కించు కున్నాయి. ఇంటాంజబుల్ కల్చరల్ హెరిటేజ్ సమావేశాన్ని భారత్‌లో నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

## దేశ ఏఐ విప్లవంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రపథాన నిలుపుతాం

**- ప్రతి కుటుంబంలో ఏఐ ప్రొఫెషనల్ ఉండాలనేది సీఎం చంద్రబాబు విజన్ - ఏపీలో గూగుల్ పెట్టుబడి ప్రారంభం మాత్రమే ఏపీలో అనుభవం, దార్శనికత కలిగిన సమర్థ నాయకత్వం ఉంది - మార్చిలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన**

**- శాన్ ఫ్రాన్సిస్కో బే ఏరియా కౌన్సిల్ సమావేశంలో మంత్రి లోకేష్**

**శాన్ ఫ్రాన్సిస్కో:** దేశ ఏఐ విప్లవంలో ఆంధ్రప్రదేశ్ ను అగ్రపథాన నిలుపుతామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఏఐ యుగంలో నైపుణ్యాలు, విశ్వాసం, రంగాల మార్పును సమన్వయం చేయడం అనే అంశంపై శాన్ ఫ్రాన్సిస్కోలోని సిలికాన్ వ్యాలీలో జరిగిన బే ఏరియా కౌన్సిల్ సమావేశంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. దేశంలోనే యువ రాష్ట్రాలలో ఏపీ ఒకటి. ప్రస్తుతం ఏపీ 180 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంది. భవిష్యత్‌లో ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం. 15 శాతం వృద్ధితోనే ఇది సాధ్యమవుతుంది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు క్లస్టర్ విధానంలో ముందుకు వెళ్తున్నాం. ఇందుకు ఆటోమోటివ్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, సీబీజీ, ఓట్స్, ఆక్వా, ఏఐ వంటి దాదాపు 20 రంగాలను గుర్తించాం. ఆయా రంగాలను క్లస్టర్ విధానంలో అభివృద్ధి చేస్తాం. ఇందుకు కావాల్సిన ఎకో సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తాం. కియా గ్లోబల్ ఉత్పత్తిలో 9 శాతం ఏపీ నుంచే వస్తోంది. దేశంలో తయారయ్యే ఏసీల్లో 50 శాతం ఏపీ నుంచే తయారవుతున్నాయి. వచ్చే 24 నెలల్లో దీనిని 70 శాతానికి తీసుకెళ్తాం.

**పునరుత్పాదక శక్తిలో దేశంలోనే టాప్-5లో ఏపీ**

పునరుత్పాదక శక్తిలో దేశంలోనే టాప్-5లో ఏపీ నిలుస్తుంది. ఆయా రంగాల్లో ఏపీ నెం.1 లేదా 2వ స్థానంలో ఉండేలా కృషి చేస్తున్నాం. ఏపీలోనే ఎందుకు పెట్టుబడులు పెట్టాలనే వారికి మూడు కారణాలు చెబుతాను. ఏపీలో అనుభవం, దార్శనికత కలిగిన సమర్థ నాయకత్వం ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవం కలిగిన నాయకుడు. ఆయనకు సుస్థిర ట్రాక్ రికార్డ్ ఉంది. ఏపీలో ఎన్నికైన ఎమ్మెల్యేల్లో 50 శాతం మంది మొదటిసారి గెలిచినవారు ఉన్నారు. 25 మంది మంత్రుల్లో 17 మంది మొదటిసారి మంత్రులు. రెండో కారణం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. ఇతర రాష్ట్రాలు ఇవ్వలేని వేగాన్ని నిరంతరంగా మేం అందిస్తాం. ఒక్కసారి మాతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. మా ప్రాజెక్ట్. ప్రతి ఎంవోయూను ట్రాక్ చేస్తాం. నిశితంగా పర్యవేక్షిస్తాం. ఒక నిర్దిష్ట స్థాయి కంటే ఎక్కువ పెట్టుబడి ఉంటే ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ద్వారా ఫాలో అఫ్ చేస్తాం. దాదాపు 30 వాట్సాప్ గ్రూప్‌ల్లో నేను ఉన్నాను.

**మార్చిలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన**

ఆదిత్య మిట్టల్‌తో నా మొదటి జూమ్ కాల్ నుంచి 16 నెలల్లోనే దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ గ్రౌండ్ బ్రేక్ అవుతోంది. పర్యా



వరణ అనుమతులు, హియరింగ్స్, భూమి కేటాయింపు, ఆర్ అండ్ ఆర్ అన్నీ పూర్తయ్యాయి. గూగుల్‌తో మా సంభాషణ 13 నెలల్లోనే ముగిసింది. వచ్చే ఏడాది మార్చిలో గూగుల్‌కు శంకు స్థాపన చేయబోతున్నాం. ఈ నెల 12 వ తేదీన కాగ్నిజెంట్ కు భూమిపూజ చేస్తున్నాం. మూడో కారణం ఏపీలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. ప్రాంతీయ పార్టీ అయినప్పటికీ కేంద్రంలో కీలక పాత్ర పోషిస్తున్నాం.

**దేశ ఏఐ విప్లవంలో ఆంధ్రప్రదేశ్ ను అగ్రపథాన నిలుపుతాం**

ఏపీలో గూగుల్ పెట్టుబడి ప్రారంభం మాత్రమే. ఇవాళ గూగుల్ లీడర్‌షిప్‌తో రెండు గంటల పాటు చర్చించాం. ప్రతి కుటుంబంలో ఏఐ నిపుణుడు ఉండాలనేది సీఎం చంద్రబాబునాయుడు గారి విజన్. విద్య, ఆరోగ్యం.. ఏ రంగమైనా ప్రతి కుటుంబం ఏఐ ఆధారిత యూజ్ కేస్ సృష్టించాలి. ఏపీలో కాన్వర్సేషనల్ ఏఐ ద్వారా స్కిల్ సెన్సెస్ చేపడుతున్నాం. ఏసీ రిపేర్ టెక్నీషియన్ నుంచి ఏఐ ఇంజనీర్ వరకు స్కిల్ అసెస్ చేస్తాం. దేశ ఏఐ విప్లవంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రపథాన నిలపాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని మంత్రి నారా లోకేష్ చెప్పారు. ఈ సమావేశంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఏఐ డేటా, ఇన్నోవేషన్ హెడ్ ఆండ్రీ డూయెట్, ఫ్యూజన్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్ పార్ట్‌నర్ డేవిడ్ గెర్‌స్టర్, బెంజిమిన్ లార్సన్ (ఇనీషియేటివ్ లీడ్, ఏఐ సిస్టమ్స్ అండ్ సేఫ్టీ, సెంటర్ ఫర్ ఏఐ ఎక్సలెన్స్, వరల్డ్ ఎకనమిక్ ఫోరం), పీటర్ లీరో-మునోజ్ (ఎస్ వీపీ ఫర్ టెక్ ఇన్నోవేషన్ అండ్ పాలసీ, బే ఏరియా కౌన్సిల్), లూకే కోవాల్స్కి (ఎస్ వీపీ కార్పొరేట్ ఆర్కిటెక్చర్, ఒరాకిల్), మార్క్స్ లోబో(సీఈవో, ఆస్క్ మీడియా), విశాల్ మిశ్రా(జనరల్ పార్ట్‌నర్, క్లియన్ స్టోన్ వెంచర్స్), సీన్ రాండాల్ (సీనియర్ డైరెక్టర్, బే ఏరియా కౌన్సిల్ ఎకనమిక్ ఇన్‌స్టిట్యూట్), వివేక్ వాద్వా (సీఈవో, వియోనిక్స్ బయోసైన్సెస్), సోంగ్ యూన్ (మేనేజింగ్ పార్ట్ నర్, ప్రిన్సిపల్ వెంచర్ పార్ట్‌నర్స్) తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ వృద్ధిరేటు పెంపునకు ప్రభుత్వం చర్యలు..

## అధికారులకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర వృద్ధిరేటు పెంపునకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్య క్షతన మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌ఓడీలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏపీ వృద్ధిరేటు అమలుపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. వృద్ధిరేటు పెంపునకు రానున్న నాలుగు నెలల్లో తీసుకోవాల్సిన అంశాలు, అమలు చేయాల్సిన ప్రణాళికపై సూచనలు చేశారు సీఎం చంద్రబాబు. ఈ ఆర్థిక సంవత్సరంలో 17.11 శాతం మేర వృద్ధి రేటు సాధించేలా లక్ష్యం పెట్టుకున్నామని వివరిం చారు. 2025 నుంచి 2026 ఆర్థిక సంవత్సరంలోని మొదటి రెండు త్రైమాసికాల్లో సాధించిన ఆర్థిక ఫలితాలపై ఈ సమావేశంలో చర్చించారు. మూడు, నాలుగు త్రైమాసికాల్లో సాధించాల్సిన లక్ష్యాలపై అధికారులకు సీఎం మార్గనిర్దేశం చేశారు. జీఎస్డీపీ, కేపీఐ, పబ్లిక్ పాజిటివ్ పర్‌సెప్షన్, డేటా డ్రివెన్ గవర్నెన్స్, తదితర అంశాలపై సూచనలు చేశారు సీఎం చంద్రబాబు. సూపర్ సిక్స్ పథకాలు, పౌరసేవలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్షిస్తున్నారు. ఫైళ్ల క్లియరెన్స్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, అవేర్, డేటాలేక్, ఐటీ అప్లికేషన్లపై సమావేశంలో ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలు, ఫిర్యాదులు వాటి పరిష్కారంపై హెచ్‌ఓడీలకు ముఖ్యమంత్రి సూచనలు చేశారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు వాటి ఫలితాలపై సమావేశంలో చర్చిస్తున్నారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న రుణాలు, వాటి రీస్ట్రక్చరింగ్ అంశంపై శాఖల వారీగా మాట్లాడుతున్నారు సీఎం చంద్రబాబు.

## పట్టువస్త్రాలు కాదు పాలిస్టర్..

## తిరుమలలో మరో భారీ స్కామ్

**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుమల తిరుపతి దేవస్థానంలో ఇటీవల వెలుగు చూసిన పట్టు దుపట్టా కుంభకోణంపై.. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించారు. మల్బరీ పట్టు వస్త్రాలకు బదులుగా.. పాలిస్టర్ వస్త్రాలు సరఫరా అయ్యాయనే విషయమై.. ఏసీబీ అధికారులు దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. 'టీటీడీలో మరో స్కామ్.. రూ.54 కోట్ల నకిలీ పట్టు దుపట్టా మోసం బయటపడింది. ఈ విషయమై ఏసీబీ దర్యాప్తు చేపట్టింది. త్వరలోనే మరిన్ని వివరాలు తెలుస్తాయి. ఏదైనా దేవస్థానంలోకి వెళితే.. మీకు కొంత దుష్ప్రవర్తన కనిపిస్తుంది. పరకామణి విషయంలో చాలా మంది చట్ట విరుద్ధంగా వ్యవహరించారు. టీటీడీలో ఎప్పటినుంచో కొంతమంది ఇష్టం వచ్చినట్లుగా చేశారు. ఇప్పుడు వెలుగులోకి రావడానికి ఏకైక కారణం.. మనకు బలమైన టీటీడీ బోర్డు, ప్రభుత్వం ఉండటమే. నేడు మనందరికీ ముఖ్యమంత్రి నుంచి మార్గదర్శకత్వం ఉంది. సరైన ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాం. గతంలో మేము పుకార్లను మాత్రమే విన్నాం. ఇప్పుడు అక్కడ ఏం జరిగింది? ఏం చేశారో? నిజం తెలుస్తుంది. భారతదేశంలోని ఇతర మతాలతో పోలిస్తే.. ప్రభుత్వ చర్యలు, బహిరంగ ప్రకటనలకు సంబంధించి హిందువులను అవమానంగా చూస్తున్నారు. నేను గతంలో చెప్పినట్లుగా హిందువులను లక్ష్యంగా చేసుకుని నిలదీస్తున్నారు' అని పవన్ చెప్పారు.

**ఎక్కడుంది మెజారిటీ.?**

రాజ్యాంగం, చట్టం రెండు వైపులా ఉండేలా విధిగా పనిచేయాలనేదే తన అభిప్రాయమని పవన్ తెలిపారు. ముస్లిం లేదా క్రైస్తవ



ప్రయోజనాలను కాపాడటానికి కొన్ని నిబంధనలు వర్తింపజేస్తే.. అవి హిందువులకూ సమానంగా వర్తిస్తాయని ఆయన పేర్కొన్నారు. హిందువులు మెజారిటీ అనే ఆలోచన.. తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు అవుతాయని పేర్కొన్నారు. 'మెజారిటీ ఎక్కడ ఉంది? హిందువులు.. కులం, భాష, ప్రాంతం ద్వారా విభజన చెందారు. దేవాలయానికి వెళ్లి చేతులు జోడించేవారు, సనాతన ధర్మాన్ని విశ్వసించే ఎవరైనా.. బుజ్జగింపు రాజకీయాలను ఆచరించే నాయకులకు వ్యతిరేకంగా తమ ఆందోళనలను వినిపించాలి. తమిళనాడు సీఎం స్టాలిన్ అధికారం కోసం ఒక సమస్యలాగా మాట్లాడారు. కానీ.. తన సొంత మతమైన క్రైస్తవ మతం గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి ధైర్యం చేస్తారా? హిందువులను లక్ష్యంగా చేసుకోవడం అందరికీ సులభంగా మారింది. ఐదు సంవత్సరాలకు పైగా సీఎంగా పనిచేసిన వ్యక్తిగా.. ఆయన అలాంటి ప్రకటనలు చేయకూడదు. తమిళనాడులోని ఆలయ వ్యవహారాల్లో డీఎంకే ప్రభుత్వం జోక్యం చేసుకుంటుంది. రాజ్యాంగంలో మొదట చేతితో రాసిన ముసాయిదాలో భగవద్గీత తను గురించి ప్రస్తావించారు' అని డిప్యూటీ సీఎం అన్నారు.

## తుళ్లూరు మండలం వడ్డమానులో మంత్రి నారాయణ పర్యటన





**అమరావతి, (రాజధాని వార్తలు):** స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో కలిసి రైతులతో సమావేశం నిర్వహించిన మంత్రి. ల్యాండ్ పూలింగ్‌పై రైతుల అభిప్రాయాలు తీసుకున్న మంత్రి. రైతులతో సమావేశంలోనే మంత్రి నారాయణకు భూమి దస్తావేజులు అందజేసిన ముగ్గురు రైతులు. ల్యాండ్ పూలింగ్ కు భూములిచ్చిన రైతులు మైనేని సత్యనారాయణ,పిన్నక తరుణ్ సాయి,నిడదవోలు శివపార్వతి.

నారాయణ, మంత్రి కామెంట్స్...

ల్యాండ్ పూలింగ్ కు వడ్డమాను గ్రామ రైతులంతా సానుకూలంగా ఉన్నారు. గతంలో ల్యాండ్ పూలింగ్‌లో రైతులకు ఎదురైన ఇబ్బందులు లేకుండా చూస్తాం. రైతుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత మాపై ఉంది. రైతులు అడిగిన కొన్ని అంశాలను సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. 29 గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులతో పాటు వడ్డమానులో కూడా మౌళిక వసతులు కల్పిస్తాం. రైతులకు ఇచ్చే ప్లాట్లలో ముందుగా రెండు వరుసల రోడ్లు నిర్మించి వినియోగానికి అందుబాటులోకి తీసుకొస్తాం. 2019లో ప్రభుత్వం మారడం వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారు. గత ప్రభుత్వ నిర్వాకంతో నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుతంది.

# రైతులను అడ్డు పెట్టి సోమిరెడ్డి దోపిడి : కాకాణి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, పొదలకూరు మండలం, పులికొల్లు గ్రామం వద్ద నిమ్మతోటలను, కండలేరు జలాశయం స్పిల్ వేను రైతులు, స్థానిక గ్రామాల ప్రజలతో కలిసి పరిశీలించి, లింగంపల్లి, కళ్యాణపురం గ్రామాలలో పర్యటించిన మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. మోంథా తుఫాను పేరిట సోమిరెడ్డి దోపిడీని కొనసాగిస్తున్నాడన్న కాకాణి. ఇరిగేషన్ పనులకు సంబంధించి, సర్వేపల్లి నియోజకవర్గంలో 16 కోట్ల 90 లక్షల రూపాయలు కాజేసేందుకు సోమిరెడ్డి స్కెచ్ వేశాడన్న కాకాణి. నెల్లూరు జిల్లా చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా, జిల్లా కలెక్టర్ 93 కోట్ల 27 లక్షల రూపాయలు ఇరిగేషన్ పనులకు తాత్కాలిక మరమ్మత్తుల పనులకు మంజూరు చేయడం గమనార్హం అన్న కాకాణి. ఒకే సంవత్సరంలో ఇప్పటికే ఎస్డిఎంఎఫ్, ఓ అండ్ యం పద్దుల కింద మంజూరు చేయించుకొని పనులు చేయకుండానే, బిల్లులు భోంచేసి, ఇప్పుడు ఎఫ్డిఆర్ కింద దాదాపు 17 కోట్లు కాజేయడానికి సోమిరెడ్డి స్కెచ్ వేశాడన్న కాకాణి. నేను మొదటి నుండి చెప్తున్నట్టుగానే మోంథా తుఫాన్‌లో సోమిరెడ్డి హడావిడి అంతా, ఇరిగేషన్ పేరిట ప్రజా సొమ్ము దోచుకున్నందుకేనని బహిర్గతమవుతుందన్న కాకాణి. దిత్వా తుఫానుకు సోమిరెడ్డి, సోమిరెడ్డి కొడుకు మరలా ఎన్ని కోట్ల రూపాయలు దోచుకోవడానికి ప్లాన్ వేస్తారో చూడాలన్న కాకాణి. జిల్లా కలెక్టర్‌ని తప్పుదోవ పట్టించారో, జిల్లా కలెక్టర్ అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి, పనులు మంజూరు చేశారో అర్థం కావడం లేదన్న కాకాణి. సోమిరెడ్డి ఇరిగేషన్ పనుల అవినీతిపై విచారణ జరిపిస్తే, సోమిరెడ్డితో పాటు, ఇరిగేషన్ అధికారులు కూడా జైలు పాలు కావడం ఖాయమన్న కాకాణి. సోమిరెడ్డి ఒంట్లో చీము, నెత్తురు ఉంటే, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన ఇరిగేషన్ పనుల మీద, సర్వేపల్లి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఇరిగేషన్ పనుల మీద సిబిఐ విచారణకు సిద్ధమా! అని సవాలు విసిరిన కాకాణి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుమాల వెంకటరమణారెడ్డి, తళ్లపరెడ్డి సుబ్బరామిరెడ్డి కుటుంబాలను పరామర్శించి, వెన్నపూస లక్ష్మణ్ రెడ్డికి నివాళులర్పించిన కాకాణి. దిత్వా తుఫాను ప్రభావంతో రైతులు, ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడ్డారు. రైతులు వేసిన నారుమళ్లు పూర్తిగా నీట మునిగాయి. ఉద్యానవన పంటలు దెబ్బతిని రైతులు భారీగా నష్టపోయారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రజలు, రైతులు పడిన కష్టాలను క్షేత్ర స్థాయిలో తెలుసుకునేందుకు పర్యటిస్తున్నాం. వర్షాలు ఆగిపోయి 7 రోజులు గడుస్తున్నా, నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులకు ఎటువంటి విధివిధానాలు ఇవ్వకుండా, కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంది. కూటమి ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. రైతులకు ప్రభుత్వం విత్తనాలు పంపిణీ చేయకపోయినా సొంత ఖర్చులతో నారుమళ్లు వేసుకొని వర్షాల కారణంగా దెబ్బతిన్న తర్వాత కూడా ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాలు అందజేయకుండా కాలయాపన చేస్తుంది. చంద్రబాబు ప్రభుత్వంలో రైతులు పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర అందలేదు. రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా, కూటమి ప్రభుత్వం రైతులకు యూరియా విషయంలో పరిమితులు పెట్టింది. కూటమి ప్రభుత్వంలో తెలుగుదేశం నాయకులు యూరిన్ బ్లాక్‌లో అమ్ముకుంటూ, రైతుల పట్ల పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులు యూరియా బస్తా 900 రూపాయలకు కొనుగోలు చేయవలసిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సమగ్రంగా, సంపూర్ణంగా పార్టీలకతీతంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల ముంగిటకే ఎరువులు అందించాం. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో లాభపడిన నిమ్మ రైతులు కూటమి ప్రభుత్వంలో నష్టపోయామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలకు చేనేత మగ్గాలలో నీరు చేరి ఇబ్బందులు పడుతున్నా, చేనేతలను ఆదుకోకుండా, చంద్రబాబు ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తుంది. చంద్రబాబు పాలనలో అన్నదాత ఆకలితో అలమటించే పరిస్థితి ఏర్పడటం దౌర్భాగ్యం. సోమిరెడ్డి సంక్షోభంలో అవకాశాలు వెతుక్కుంటూ, గతంలో చేసిన పనులను మోంథా తుఫానులో చేశామని చూపించుకొని రైతులను అడ్డుపెట్టుకొని దోచుకుంటున్నాడు. కూటమి ప్రభుత్వంలో మోంథా తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులకు, కష్టపడ్డ ప్రజలకు ఇప్పటి వరకు ఆర్థిక సహాయం చెయ్యకుండా, సోమిరెడ్డిలాంటి అవినీతి పరులకు ఆర్థిక సహాయం అందిస్తుంది. మోంథా తుఫానులో రైతులను అడ్డుపెట్టుకొని 16 కోట్ల 90 లక్షల రూపాయలు దోచుకోవడానికి నిధులను మంజూరు చేయించుకున్నాడు. సోమిరెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంలో గుడి, బడి తేడా లేకుండా ప్రభుత్వ, ప్రైవేట్ టు భూములను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నాడు. దానకర్ణుడిలాగా మాట్లాడే సోమిరెడ్డి, సర్వేపల్లి ప్రజల సొత్తు దోచుకుంటూ, గత జన్మలో ఏమైన చేసిన దానాలను రాబట్టుకోవాలని ప్రయత్నిస్తున్నాడని ప్రజలు భావిస్తున్నారు. సోమిరెడ్డి సిగ్గు, శరం లేకుండా అవినీతికి పాల్పడుతూ, రైతులను సైతం అడ్డుపెట్టుకొని దోచుకునేందుకు సిద్ధపడ్డాడు. దొంగే..దొంగ.. దొంగ అన్నట్లు సోమిరెడ్డి ఇరిగేషన్ పనులలో దోచుకుంటూ, గత ప్రభుత్వంలో అవినీతి జరిగిదంటూ మాట్లాడుతున్నాడు. సోమిరెడ్డికి సిగ్గు, ఎగ్గు ఉంటే, సర్వేపల్లిలో జరిగిన ఇరిగేషన్ పనులపై రైతుల సమక్షంలో చర్చకు సిద్ధపడాలి. సోమిరెడ్డికి దమ్ము ధైర్యం ఉంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన ఇరిగేషన్ పనులు, కూటమి ప్రభుత్వంలో జరిగిన ఇరిగేషన్ పనులపై సిబిఐ విచారణ జరిపించాలి. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత సోమిరెడ్డి, సోమిరెడ్డి కొడుకుతో పాటు, ఎంతమంది ఇరిగేషన్ అధికారులు, మేనేజర్లు జైలుకు వెళ్లుతారో ప్రజలే చూస్తారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సోమిరెడ్డి రైతులను అడ్డుపెట్టుకొని, ఏ విధంగా దోచుకున్నాడో, గ్రామసభలు పెట్టి రైతులకు అవగాహనను కల్పించే కార్యక్రమాన్ని త్వరలోనే చేపడుతాం. విరువూరు, సురాయపాళెం ఇసుక రీచ్‌ల నుండి ఇసుకను తరలించి, 100 కోట్లకు పైగా ప్రజాసొత్తును సోమిరెడ్డి దోచుకున్నాడు. కాకుటూరు శివాలయానికి చెందిన భూమిని సోమిరెడ్డి అమ్ముకొని సొమ్ము చేసుకోవడం తగదని మాట్లాడితే, నాపై కేసులు పెడుతూ, పోలీసు స్టేషన్ల చుట్టూ సోమిరెడ్డి తిరుగుతున్నాడు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో దేవుని భూములకు కాపలాగా నిలబడ్డాం. చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా సంవత్సరానికి 20వేలు పెట్టుబడి సహాయం రైతులకు అందిస్తానని హామీచ్చి, ఓట్లు వేయించుకొని, రెండు సంవత్సరాలకు 40 వేలకు గాను, 10 వేలు చేతిలో పెట్టి రైతులను మోసం చేశాడు. ఎక్కడికి వెళ్లినా రైతులు, నిన్ను నమ్మం బాబు అంటూ ముక్తకంఠంతో చెబుతున్నారు. జగన్మోహన్ రెడ్డి సంవత్సరానికి 13,500/–లు పెట్టుబడి సహాయం వైయస్సార్ రైతు భరోసా పథకం ద్వారా 5 సంవత్సరాలు క్రమం తప్పకుండా 67,500 రూపాయలు అందించి, రైతులకు అండగా నిలిచారు. లోతట్టు ప్రాంతాలలో ఇబ్బంది పడిన ప్రజలను, చేనేతలను, ఆక్వా రైతులను, ఉద్యానవన పంటల రైతులను, నారుమళ్లు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

# ఏపీలో డీప్ సీ ఫిషింగ్ అభివృద్ధికి కేంద్రం తీసుకుంటున్న చర్యలేంటి?

## - లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ తీరం వెంబడి డీప్ సీ ఫిషింగ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏంటని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం లోక్‌సభలో ఈ మేరకు పలు అంశాలను ఆరా తీశారు. డీప్ సీ ఫిషింగ్‌కు ఉపయోగిస్తున్న పడవల సంఖ్య ఎంతని అన్నారు. వీటి సంఖ్యను పెంచడానికి తీసుకుంటున్న చర్యలు, డీప్ సీ ఫిషింగ్ అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల వివరాలపై ఆరా తీశారు. గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో పథకాల అమలుకు కేటాయించిన నిధుల వివరాలు, లబ్ధిదారుల సంఖ్య, డీప్ సీ ఫిషింగ్ ఓడల వాడకంపై అవగాహన వంటి అంశాలపై ఆరా తీశారు. దాంతో పాటు ఒడిశాలోని భద్రక్, బాలసోర్ జిల్లాల్లో సహకార నేతృత్వంలో డీప్ సీ ఫిషింగ్, ఫిష్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ మద్దతు, సముద్ర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉన్న ప్రతిపాదనలపై వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సమాధానం ఇచ్చారు. ఇండియన్ ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ (ఇఇజెడ్)లో మత్స్య వనరుల పొటెన్షియల్ దిగుబడిని ధృవీకరించడానికి ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ అంచనా మేరకు.. ఇఇజెడ్ యొక్క పొటెన్షియల్ దిగుబడి 53.1 లక్షల టన్నులు ఉందన్నారు. దీనిలో డీప్ సీ ఫిషింగ్ వనరుల పొటెన్షియల్ దిగుబడి (500 మీటర్ల లోతు జోన్ దాటి) 2.31 లక్షల టన్నులన్నారు. ప్రస్తుతం, భారతదేశం డీప్ సీ ఫిషింగ్ వనరులతో సహా 44.95 లక్షల టన్నుల (2023–24) సముద్ర మత్స్య వనరులను ఉపయోగించుకుంటోందని చెప్పారు. ఇది ఇఇజెడ్‌లోని వనరుల పొటెన్షియల్ దిగుబడి కంటే తక్కువగా ఉందన్నారు. జాతీయ సముద్ర మత్స్యకార విధానం, 2017 ఇతర అంశాలతో పాటు, సాంప్రదాయ మత్స్యకారులు లోతైన సముద్ర చేపల వేటను చేపట్టడానికి మత్స్యకారుల సహకార సంఘాలు/స్వయం సహాయక బృందాల ద్వారా దేశీయ లోతైన సముద్ర చేపల వేట నౌకలను ప్రవేశపెట్టడానికి, ఆన్–బోర్డ్ శిక్షణ, మార్కెట్లు, ఎగుమతులకు అనుసంధానాలకు కొత్త పథకాలను ప్రవేశపెట్టాలని భావిస్తోందని చెప్పారు. భారత EEZ, హై సీస్‌లోని డీప్–సీ ఫిషరీస్ వనరులను ఉపయోగించుకునే అవకాశాన్ని కల్పించేందుకు ఒక ఉప–భాగాన్ని ప్రవేశపెట్టింది. 'ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన' కింద జనరల్ కేటగిరీకి 40% సబ్సిడీ, SC/ST/మహిళా లబ్ధిదారులకు 60% సబ్సిడీ చొప్పున సాంప్రదాయ మత్స్యకారులకు ఆర్థిక సహాయం కొనసాగించబడుతుందన్నారు. బ్లూ రివల్యూషన్, PMMSY మరియు FIDF పథకాల కింద, సాంప్రదాయ మత్స్యకారులు 1243 డీప్ సీ ఫిషరీస్ వెజల్స్ కొనుగోలు చేయడానికి, ఎగుమతి సామర్థ్యం కోసం ఇప్పటికే ఉన్న 1330 ఫిషింగ్ ఓడలను అప్‌గ్రేడ్ చేయడానికి రూ. 895.9 కోట్ల విలువైన ప్రాజెక్టులు మంజూరు చేయబడ్డాయన్నారు.

# "కోటి సంతకాల సేకరణ విజయవంతం" : కాకాణి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శాసనమండలి సభ్యులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య , నెల్లూరు రూరల్ ఇంచార్జీ ఆనం విజయకుమార్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడిన మాజీ మంత్రి వర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. మా పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వర్యులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో కందుకూరు నియోజకవర్గంతో సహ (11 నియోజకవర్గాలలో) మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నియోజకవర్గ ఇన్చార్జీల ఆధ్వర్యంలో మహా యజ్ఞంలా సాగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ అనుబంధ సంఘాలు, విద్యార్థుల తల్లితండ్రులు, ప్రజా సంఘాలు, మేధావులు, విద్యావేత్తలకు అందరికీ కృతజ్ఞతలు.. సేకరించిన కోటి సంతకాలను డిసెంబర్ 10వ తేదీ నియోజవర్గ కేంద్రాల నుండి ఊరేగింపుగా వైయస్సార్సీపీ జిల్లా కార్యాలయానికి చేరుస్తాం. డిసెంబర్ 15వ తేదీన, 11 నియోజకవర్గాలకు సంబంధించి కోటి సంతకాలకు సంబంధించిన ప్రతులను గాంధీ బొమ్మ సెంటర్ నుండి ఊరేగింపుగా ర్యాలీ నిర్వహించి, డా.ఎం.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం దగ్గర ముగింపు సభ నిర్వహించడం జరుగుతుంది. డిసెంబర్ 17వ తేదీ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో సేకరించిన కోటి సంతకాలను రాష్ట్ర గవర్నర్‌కి అందించి మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ ఆపాలని కోరుతాం. కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం విజయవంతం కావడంతో చంద్రబాబుకు, కూటమి నేతలకు కడుపు మండిపోతుంది. ఇండిగో వ్యవహారంలో వార్ రూం నిర్వహించామని చెప్పుకొని తెలుగుదేశం నవ్వులు పాలైంది.

కూటమిలోని భాగస్వామ్య పార్టీలు కూడా మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాతో కలిపి నడిచారు. కరుడుగట్టిన టిడిపి పార్టీకి సంబంధించిన వ్యక్తులు కూడా కోటి సంతకాలు సేకరణకు కొందరు నేరుగా, మరికొందరు పరోక్షంగా సంతకాలు పెట్టి మద్దతు తెలిపారు. కోటి సంతకాలు సేకరణ కార్యక్రమానికి మద్దతు తెలిపి, విజయవం తం చేసిన ప్రతి ఒక్కరికీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పేరుపేరున హృదయపూర్వక ధన్యవాదాలు.



# రహదారి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గ్రామస్తుల రహదారి సమస్యకు పరిష్కారం చూపారు. కొడవలూరు మండలం దాసరిపాలెం నుంచి యల్లాయపాలెం వెళ్లే రహదారి గుంతలు పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసు కున్న ఎమ్మెల్యే ప్రశాంతమ్మ.. తక్షణమే అధికారులను ఆదేశించి రహదారిపై ఉన్న గుంతలను పూడ్చి లెవలింగ్ చేయించి సమ స్యను పరిష్కరించారు. ఇక్కడ త్వరలోనే సీసీ రోడ్డు పడనుంది. సీసీ రోడ్ పూర్తి అయితే ప్రజలకు శాశ్వత రవాణా సౌకర్యం ఏర్పడనుంది.

# అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**ఒంగోలు, (రాజధాని వార్తలు):** ఒంగోలు నగరంలో సుడిగాలి పర్యటన చేపట్టిన ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ రావు స్థానిక అధికారులతో కలిసి పలు ప్రాంతాలలో పర్యటన చేశారు. ముందుగా నగరంలోని కర్నూల్ రోడ్డు ఫ్లైఓవర్‌నందు 80 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు పరిశీలిం చడం జరిగినది. ఫ్లైఓవర్ క్రింద బిటి రోడ్డు వల్ల ఇప్పుడు గుంతలు పడటం గమనించి సీసీ రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు తెలియజేసారు. తదుపరి సౌత్ బైపాస్ క్విస్ కాలేజీ జంక్షన్ నందు మాజీ ప్రధాని వాజపేయి విగ్రహానికి బీజేపీ నాయకులతో కలిసి భూమి పూజ కార్యక్రమం చేపట్టడం జరిగినది. తదుపరి కొప్పోలు ఫ్లైఓవర్ క్రింద 40 లక్షలతో నిర్మించునున్న ఆర్.ఓ.బి కల్వర్ట్ పనులు పరిశీలించడం జరిగినది. ఫ్లైఓవర్ వద్ద నుండి కొప్పోలు వరకు రోడ్డుకు రెండు వైపుల సీసీ డ్రైనేజ్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులు ఆదేశించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కమిషనర్ డాక్టర్ కే.వెంకటేశ్వరావు, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నడం జరిగినది.

# చెర్లోపల్లి మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలించిన తుడా చైర్మన్



**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతి అభివృద్ధిలో భాగంగా నాయుడుపేట బెంగళూరు జాతీయ రహదారి వకుళమాత ఆలయం నుంచి చెర్లోపల్లి జంక్షన్ మీదుగా నూతనంగా నిర్మిస్తున్న 200 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డును తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డి పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణంలో భాగంగా భూముల కోల్పోయిన స్థానికులతో చర్చించారు. భూములు కోల్పోయిన యజమానులకు టిడిఆర్ బాండ్స్ ద్వారా నష్టం పరిహారం ఇవ్వడం జరుగుతుందని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు పరిశీలనకు వచ్చిన తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డికి అధికారులు రోడ్డు నిర్మాణ పనులలో పాటిస్తున్న నాణ్యత ప్రమాణాల గురించి వివరించారు. రోడ్డుకు ఇరువైపుల సుందరీకరణ పనులు, సెంట్రల్ లైటింగ్, పుత్ పాత్, వాకింగ్ ట్రాక్ వంటివి చేపట్టి స్థానిక ప్రజల అవసరానికి అనుగుణంగా తీర్చిదిద్దాలని అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలకు అనుకూలంగా ఈ మాస్టర్ ప్లాన్ రోడ్డు మారుతుందని,తిరుమలకు విచ్చేసే భక్తులకు ఉపయో గకరంగా ఉంటుందని తెలిపారు. అనంతరం తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని స్థానికులు, కూటమి నాయకులు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, స్థానిక కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఎగువవీధి శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఎగువవీధి శాఖ ఆధ్వర్యంలో తిరుపతి అగర్వాల్ మెడికల్ హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రీజినల్ మేనేజర్ పి.ప్రకాశ రత్న బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ ప్రకాష్ రత్నబాబు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని బ్యాంక్ ఖాతాదారులు, గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అగర్వాల్ కంటి వైద్య హాస్పిటల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 80 మంది ఖాతాదారులకు తిరుపతి అగర్వాల్ మెడికల్ హాస్పిటల్ వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించి, అవసరమైన చికిత్సపై సూచనలు ఇచ్చారు. పలు కంటి సమస్యలను గుర్తించి ఖాతాదారులకు తగిన జాగ్రత్తలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎస్.బాల నరసింహం, సిబ్బంది కలిసి శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు.




# బాలికకు మంత్రి సుభాష్ రూ.15 వేలు సాయం



**అమలాపురం, (రాజధాని వార్తలు):** అంగవైకల్యంతో పాటు మానసిక స్థితి సక్రమంగా లేని ఒక బాలికకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మానవతా దృక్పథంతో రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించారు. వివరాల్లోకి వెళితే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నియోజవర్గం రంగాపురం గ్రామంకు చెందిన యనమదల పార్వతి కుమార్తె యనమదల సబితగౌరీ (12 సంవత్సరాలు) అంగవైకల్యంతో పాటు, మానసిక స్థితి సక్రమంగా లేదు. ఆ బాలిక ఆరోగ్య పరిస్థితి, కుటుంబ ఆర్థిక పరిస్థితిని మంత్రి సుభాష్ సృష్టికి స్థానిక నాయకులు తీసుకు వచ్చారు. ఆ బాలిక దయనీయ స్థితిని చూసి చలించిన మంత్రి సుభాష్ తక్షణ సహాయంగా రూ.15 వేలు చెక్కును అందించారు. అలాగే సబిత గౌరీకి మెరుగైన వైద్యం అందేలా సహకరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. బాలిక సమస్య పట్ల వెంటనే స్పందించి సహాయం చేసిన మంత్రి సుభాస్ మానవత్వానికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

# "సర్వేపల్లిలో గుడులు, బడుల ఆస్తులకు భద్రత కరువు" : కాకాణి







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, పొదలకూరు మండల కేంద్రంలో ఆక్రమణకు గురైన శ్రీ విఘ్నేశ్వర దేవస్థాన స్థలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలాన్ని స్థానికులు, భక్తులతో కలిసి పరిశీలించిన మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. కూటమి ప్రభుత్వంలో సర్వేపల్లి నియోజకవర్గంలో గుడులు, బడుల ఆస్తులకు భద్రత లేకుండా పోయింది. పొదలకూరు మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ భూమిని స్థానికులు ప్రజల అవసరాల దృష్ట్యా గుడి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పాత తేదీలతో డాక్యుమెంట్లు తయారు చేసుకొని తెలుగుదేశం నాయకులు గుడి నిర్మాణానికి ఉపయోగించే భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. పొదలకూరు ప్రభుత్వ స్కూల్ స్థలాన్ని ఆక్రమించుకొని కట్టడాలు చేపట్టినా చర్యలు శూన్యం. పొదలకూరు ప్రాంతం పై ఏమాత్రం అవగాహన లేని సోమిరెడ్డి ఆక్రమణదారులకు వంతపడుతున్నాడు. ఆక్రమణదారులు పోలీసులను సైతం లెక్క చేయకుండా, జెసిబిలతో ప్రహరీ గోడను కూల్చి వేయడం దారుణం. పోలీసులు మొక్కుబడిగా కేసులు పెట్టి తూతూమంత్రంగా వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో భక్తులు, స్థానికుల మనోభావాలను గౌరవించకుండా, ఆస్తులకు రక్షణ కరువవ్వడం దౌర్భాగ్యం. పోలీసులు ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలి తప్ప, ప్రశ్నించేవారిపై కేసులు పెడితే తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని హెచ్చరిస్తున్నాం. పోలీసులు స్పందించి, దేవాలయ భూమిని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోకపోతే, శాంతిభద్రతలకు విఘాతం కలిగితే పోలీసు వారే బాధ్యత వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. తమ ప్రాణాలను సైతం అడ్డుపెట్టి, గుడి స్థలాన్ని రక్షించుకుంటామంటున్న స్థానికులు, భక్తుల మనోభావాలను గౌరవించి, గుడి నిర్మాణానికి మా వంతు సహాయ సహకారాలు అందిస్తాం. కుట్రలు, కుతంత్రాలు పన్ని స్థానిక ప్రజల అవసరాలను ఉపయోగించాల్సిన భూమిని దక్కించుకోవాలని ఎవరు చూసినా, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే తిరిగి ప్రజల అవసరాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటాం. స్థానికులపై దౌర్జనంగా వ్యవహరించే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వ భూములు ప్రజల అవసరాలకు ఉపయోగపడేలా, అన్యాక్రాంతం కాకుండా, ప్రజలే ముందుకు వచ్చి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

# అవినీతికి అంతమెప్పుడు? : మురళీమోహన్ రాజు









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** దేశాన్ని పట్టి పీడిస్తున్న పెద్ద సమస్య అవినీతి, దీనికి అంతమెప్పుడని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్ రాజు పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ప్రొద్దుటూరు రామేశ్వరంలోని ఎస్.పి.సి.ఎన్.మున్సిపల్ ఉన్నత పాఠశాలనందు అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వకృత్వ పోటీలు నిర్వహించి, పోటీలో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మురళీమోహన్ రాజు మాట్లాడుతూ అవినీతి ప్రపంచ దేశాలన్నింటినీ ప్రభావితం చేస్తున్న ఒక సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్య. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థల్ని బలహీన పరుస్తుందని వివరించారు. ప్రాధ్యానోపాధ్యాయులు సత్య బాబు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ, చట్టాల అమలు, పాలనా రంగంలో నిర్ణయాలను ప్రభావితం చేసి, ప్రజాస్వామ్య సంస్థల పునాదుల్ని ఈ అవినీతి బలహీన పరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విక్రమ సింహపురి యూనివర్సిటీ వంటశాలకు కొత్త వంట పాత్రలు అందజేత





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విద్యార్థులకు మరింత నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వంటశాలకు కొత్త వంట పాత్రలను ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మంగళవారం అందజేశారు. విద్యార్థుల ఆహార భద్రత, శుభ్రత మరియు వంటశాల నిర్వహణను మెరుగుపరచడం ఈ చర్య వెనుక ప్రధాన ఉద్దేశం. క్యాంపస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వంటశాల అవసరాల మేరకు ప్రత్యేకంగా కొనుగోలు చేసిన స్టెయిన్‌లెస్ స్టీల్ పెద్ద పాత్రలు, బియ్యం కుక్కర్లు, దాల్చిన పాత్రలు, నిల్వ డబ్బాలు, వడ్డన పాత్రలు మరియు శుభ్రపరిచే పరికరాలు మొదలైన వాటిని ఆయన వంటశాల సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ, "విద్యార్థులకు నాణ్యమైన, శుభ్రమైన భోజనం అందించడం విశ్వవిద్యాలయం యొక్క అత్యంత ప్రాధాన్యత. ఈ కొత్త పాత్రల వల్ల వంట ప్రక్రియ మరింత పరిశుభ్రంగా, సమర్థవంతంగా జరుగుతుందని" పేర్కొన్నారు. అంతేకాకుండా, విద్యార్థుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో భోజనశాల సామగ్రిని నిరంతరం నవీకరించడం,



అవసరమైన చోట మరిన్ని పరికరాలను కొనుగోలు చేయడం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ,హాస్టల్ వార్డెన్స్ డాక్టర్ యం.త్యాగరాజు, డాక్టర్ కోట నీలమణి కంట, డాక్టర్ ఉదయ శంకర్ అల్లం, డాక్టర్ పి.త్రివేణి, డాక్టర్ శ్రీకన్య రావు, మెస్ ఇన్‌ఛార్జ్‌లు, మరియు వంటశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో 638 పారిశ్రామిక పార్కులు

## - లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్రమంత్రి సమాధానం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** దేశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పారిశ్రామిక పార్కుల పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేంటో తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ కోరారు. మంగళవారం లోక్‌సభలో ఈ మేరకు పారిశ్రామిక పార్కుల అంశంపై వివరాలు ఆరా తీశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపాదించబడిన, నిర్మాణంలో ఉన్న, అలాగే పనిచేస్తున్న పారిశ్రామిక పార్కుల వివరాలు కోరారు. గత ఐదేళ్లలో పారిశ్రామిక పార్కులలో తయారు చేయబడిన ఉత్పత్తుల విలువ ఎంతని ప్రశ్నించారు. నిర్ధిష్ట ఉత్పత్తుల తయారీ కోసం ప్రభుత్వం కేటాయించిన పారిశ్రామిక పార్కుల వివరాలు ఆరా తీశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర వాణిజ్యం & పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమాధానం ఇచ్చారు. పరిశ్రమలు అనేవి రాష్ట్రానికి సంబంధించిన అంశమని, వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధి కోసం భారత ప్రభుత్వం.. పరిశ్రము, మరియు అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం, ఇతర కేంద్ర మంత్రిత్వ శాఖలు తగిన విధానపరమైన మద్దతు అందిస్తుందని చెప్పారు. ఇండియా ఇండస్ట్రియల్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్ ద్వారా పారిశ్రామిక పార్కులకు సంబంధించిన సమాచారాన్ని సంగ్రహించడానికి DPIIT ఒక కేంద్రీకృత వ్యవస్థను నిర్మించిందని, దీనిలో సంబంధిత రాష్ట్రాలు క్రమం తప్పకుండా వివరాలను అప్‌డేట్ చేస్తాయన్నారు. రాష్ట్రాలవారీగా పారిశ్రామిక పార్కులు, వివిధ రంగాల వారీ వివరాలు https://indiaindustriallandbank.gov.in/explore ParkReport లో అందుబాటులో ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా 4597 పారిశ్రామిక పార్కులు ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో 638 పార్కులు ఉన్నాయన్నారు. తమిళనాడు (విరుధ్‌నగర్), తెలంగాణ (వరంగల్), గుజరాత్ (నవసరి), కర్ణాటక (కలబురగి), మధ్యప్రదేశ్ (ధార్), ఉత్తరప్రదేశ్ (లక్నో) మరియు మహారాష్ట్ర (అమరావతి) లలో 7 ప్రదేశాలలో PM మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అప్పారెల్ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం రూ. 4445 కోట్ల వ్యయం చేస్తోందని పేర్కొన్నారు.

# సంపాదకీయం

## గోవాలో ఘోరం

గోవా నైట్‌క్లబ్‌లో జరిగిన అగ్నిప్రమాదం మన వ్యవస్థల బాధ్యతారాహిత్యానికీ, ప్రజల ప్రాణాలపట్ల ఉన్న నిర్లక్ష్యానికీ నిలువెత్తు నిదర్శనం. అధికారులు ఏమాత్రం నిబంధనలకు అనుగుణంగా నడుచుకున్నా, పాతికమంది ప్రాణాలు హరించిన ఈ దుర్ఘటన జరిగేది కాదు. అర్పోరా గ్రామ సమీపంలోని ఈ నైట్‌క్లబ్‌లో ప్రమాదం సంభవించగానే రెండేళ్ళుగా అది ఏ అనుమతులూ లేకుండా, చట్టవిరుద్ధంగా నడుస్తున్న సత్యాన్ని అప్పుడే తెలుసుకున్నట్టుగా మొఖంపెట్టి, సంతాపంతో పాటు, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని ప్రకటించింది. ఈ దేశంలో అక్రమాలు యథేచ్ఛగా సాగిపోతూంటాయి, నేరాలూ ఘోరాలూ జరగ్గానే ఎప్పటిలాగానే ప్రభుత్వాలు కొత్తగా ఆశ్చర్యపోతూంటాయి. దుర్ఘటనలకు కారణమైన సంస్థలకో, పరిశ్రమలకో, వాహనాలకో అనుమతులే లేవని తేల్చేస్తే తప్పు వాటిమీదకు పోతుందని, ప్రజల దృష్టి మారిపోతుందని ప్రభుత్వాలకు ఓ నమ్మకం. రెండేళ్ళక్రితం గ్రామపంచాయితీ ఈ నైట్‌క్లబ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నోటీసులు ఇచ్చి, మరో ఆర్నెల్ల తరువాత కూల్చివేతకు సిద్ధపడితే, స్థల యజమానిపై స్థాయిలో ప్రయత్నాలు చేసుకొని, యథాతథస్థితి కొనసాగేట్టుగా చూసుకున్నాడట. రాష్ట్ర శాసనసభలో ఈ నైట్‌క్లబ్ ప్రస్తావన ఆగస్టులో వచ్చి, మొత్తంగా అక్రమ నైట్‌క్లబ్‌ల మీద చర్చ జరిగింది కనుక, ఇదేమీ ప్రభుత్వం దృష్టికి రాని, దానికి తెలియకుండా పోయిన అంశమేమీ కాదు. కఠినచర్యలు ఇప్పుడు హామీ పడుతున్న ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ మూడు నెలల క్రితమే ఆ పని చేసి వుంటే ఇన్ని ప్రాణాలు పోయేవి కాదు. అడ్డదారిలో ఏర్పడిన క్లబ్ కనుక, ఏదీ సక్రమంగా లేకపోయింది. ఏకైక రాకపోకలమార్గం ఇరుకుగా ఉండటమే కాక, తగలబడుతున్న ఆ నైట్‌క్లబ్ దగ్గరగా పోయేందుకు కూడా అవకాశం లేక ఫైరింజన్లు అరకిలోమీటరు ఇవతలే ఆగిపోవాల్సివచ్చిందట. విస్తృతంగా వెదురు, గడ్డి ఉపయోగించి తయారు చేసిన పైకప్పును సులువుగా తగలబడే పదార్థాలతో మరింత సుందరంగా ఈ నైట్‌క్లబ్ నిర్వాహకులు తీర్చిదిద్దారు. టపాసులు కాలిస్తే తగలబడుతుందన్న భయం, జ్ఞానం వారికి లేవనుకోవాలో, పోతేపోనీ అన్న నిర్లక్ష్యమో తెలియదు. మంటల్లో బయటకుపోయే దారిలేక వంట సామగ్రితో పాటు ఇతరత్రా అనేకం ఉంచిన ఇరుకైన బేస్‌మెంట్‌లోకి దిగి, తిరిగి పైకి రాలేక చాలా మంది పొగకు ఉక్కిరిబిక్కిరై ప్రాణాలు విడిచారట. మంటలు రేగగానే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆ చీకట్లో జరిగిన తొక్కిసలాట అధిక ప్రాణనష్టానికి దోహదం చేసిందని అంటున్నారు. ఎంతోకాలంగా వెలుగులీనుతూ, పర్యాటకులను ఆకర్షిస్తూ, సర్వమూ విక్రయిస్తూ, చక్కగా వ్యాపారం చేసుకుంటున్న ఒక నైట్‌క్లబ్‌ను అధికారులు అక్రమం పేరిట స్వేచ్ఛగా వదిలేసి ప్రోత్సహించిన ఫలితం ఈ దారుణఘటన. ఎంతటి వారినైనా విడిచిపెట్టేది లేదంటూ పాలకుల భీషణ ప్రతిజ్ఞలు, కొన్ని అరెస్టులు, ఆరోపణలూ ప్రత్యారోపణలూ ఎప్పటిలాగానే స్క్రిప్ట్‌కు అనుగుణంగా సాగిపోతున్నాయి. ఘోరం జరిగిన ప్రదేశం మారింది తప్ప, మిగతా అంతా పాత కథే. ప్రమాదాలు జరగడం, అమాయకులు మరణించడం, విచారణకు ఆదేశించడం, మళ్ళీ ఘోరం జరిగేంతవరకూ ఆ ఊసు లేకపోవడం షరా మామూలే. జైపూర్ ఆస్పత్రిలోనూ, రాజ్‌కోట్ గేమింగ్ జోన్‌లోనూ జరిగిన ఘోర అగ్నిప్రమాదాలను ఈ దుర్ఘటన తిరిగి గుర్తు చేస్తోంది. ఢిల్లీ సహా దేశంలో పలు ప్రాంతాల్లో పిల్లల ఆస్పత్రుల్లో సంభవించిన ప్రమాదాలు కళ్ళముందు కదలాడుతున్నాయి. పర్యాటకం మీద ఆధారపడే గోవాలో ప్రజల ప్రాణాలకు భద్రత లేదన్న సందేశంపోవడం దాని మనుగడకు మంచిది కాదు. విదేశీయులు తరలి వచ్చే ఇటువంటి చోట్లలో దుర్ఘట నలు జరగడం అంతర్జాతీయంగా మనకు అప్రదిష్ట తెస్తుంది. దేశంలోని వివిధ నగరాలనుంచి గోవాకు తరలి వచ్చే యువతరం గణనీయంగా ఉన్న నేపథ్యంలో, కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్న నైట్‌క్లబ్‌లు వారికి కనీస రక్షణ కల్పించలేకపోవడం సరికాదు. పర్యాటకం నుంచి భారీగా ఆదాయం పొందుతున్న ప్రభుత్వం తగిన నియంత్రణలు లేక, ప్రాణాలకు పూచీపడలేక చేతులు ఎత్తేసిందన్న సందేశాలు వెలువడటం తప్పు. ప్రతీ దుర్ఘటన మనకు ఒక హెచ్చరిక. ప్రజల భద్రతకు పూచీపడే, వారి ప్రాణాలకు విలువనిచ్చే విధానాలను, వ్యవస్థలను తయారు చేసుకొని, తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకోగలిగితే ప్రమాదాలు పునరావృతం కాకుండా నిరోధించవచ్చు.

# శ్రీ ఉత్సవ్ స్టాల్స్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిరమ్మ





**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరంలో ఎన్.సీ.ఎస్.రోడ్డులో గల తోష్నివాల్ భవన్‌లో శ్రీ జైన్ శ్వేతాంబర్ తెరాపంత్ మహిళా మండల వారిచే శ్రీ ఉత్సవ్ స్టాల్స్ ప్రారంభోత్సవం కార్యక్రమానికి ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైయస్సార్.సీ.పీ.జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయనగరం జిల్లా కేంద్రంలో ఇటువంటి స్టాల్స్ ప్రారంభించడం సంతోషకరమన్నారు. దీనివల్ల మహిళల్లో ఆర్థిక స్వావలంబన పెట్టి పెరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఈ స్టాల్స్ ఏర్పాటు చేసే సంఖ్య పెరగాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం కొన్ని వస్తువులను స్వయంగా కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఉత్సవ్ అధ్యక్షులు అనితా బోత్రా, కార్యదర్శి క్రాంతి ఖతేర్, చిన్న శ్రీను సోల్జర్స్‌ఉపాధ్యక్షుడు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ఉద్యమం

### - కరప మండలంలో విజయవంతం





**కరప, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం కరప మండలంలో విజయవంతంగా కొనసాగింది. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, మాజీ మంత్రివర్యులు కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని కరప మండలంలోని విజయవంతంగా నిర్వహించారు. కరప, కొరిపల్లె గ్రామాల నుంచి సేకరించిన సంతకాల పత్రాలను మంగళవారం కన్నబాబుకు పార్టీ నాయకులు అందజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సాగుతున్న ఈ సంతకాల యాత్రకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.

ఈ కార్యక్రమంలో కొరిపల్లె సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు, నక్కా సత్యనారాయణ (సత్తిబాబు), కోలా శ్రీను, నాగల బాలాజీ, కుక్కర్ ప్రసాదు తదితర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మొదలగువారు పాల్గొన్నారు.

# కరప పీహెచ్‌సీలో సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం

### - గర్భిణీ స్త్రీలకు పండ్లు, బ్రెడ్, డ్రై ఫ్రూట్స్ పంపిణీ





**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెల 9వ తేదీన నిర్వహించే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం మంగళ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరప గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి కుమార్ దంపతులు గర్భిణీ స్త్రీలకు పండ్లు, బ్రెడ్, డ్రై ఫ్రూట్స్, బిస్కెట్లు పంపిణీ చేశారు. గర్భిణీ స్త్రీల మధ్య ఈ సంవత్సరం క్రిస్మస్ వేడుకలను ముందుగానే జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని సర్పంచ్ దంపతులు తెలిపారు. వారికి సేవ చేయడం ఒక బాధ్యతగా ఆనందంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, వలసపాకల సర్పంచ్ వాసంశెట్టి రామారావు, కరప పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. అఫ్రోజ్, జిజిహెచ్ గైనకాలజిస్ట్ డా. కే.ఆర్.మౌనిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, మంచాల శ్రీనివాస్, పేపకాయల తణుకులరాజు తదితరులు పాల్గొన్నారు.

# భాషల ఔన్నత్యాన్ని గుర్తించాలి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** మన దేశం బహు భాషలతో విరాజిల్లుతూ భిన్నత్వంలో ఏకత్వం ప్రాతిపదికన ప్రగతి పథంలో పయనిస్తుందని, విద్యార్థులు వివిధ భాషల్లో ఉన్న సౌలభ్యాన్ని గుర్తించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత స్థానిక పిఎం శ్రీ మున్సిపల్ హైస్కూల్ అయోధ్య రామపురం ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయిరామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం భాషా వారోత్సవాల్లో భాగంగా స్కూల్ భాష క్లబ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థి త్రీ భాషా నైపుణ్యంతోపాటు వీలైనన్ని ఎక్కువ భాషలు నేర్చుకో వాలని సూచించారు. హిందీ భాషా ఉపాధ్యాయుని సి హెచ్ బబిత పలు భాషల్లో మాట్లాడి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఎన్ హరినాథ్, జి బేబీ రాణి, వి దుర్గ ప్రసాద్‌లు ఇంగ్లీష్, తెలుగు భాషలో మాధుర్యం వివరించారు. విద్యార్థులు చాందిని, హరిణిలు మీరు బావున్నారా అనే వాక్యాన్ని పలు భాషల్లో మాట్లాడి ఆకట్టుకున్నారు.

# స్క్రబ్ టైపస్ బ్యాక్టీరియా వ్యాప్తి పట్ల అప్రమత్తంగా ఉండాలి



**అమలాపురం, (రాజధాని వార్తలు):** స్క్రబ్ టైపస్ బ్యాక్టీరియా వ్యాప్తి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. స్క్రబ్ టైపస్ బ్యాక్టీరియా కీటకాలు వ్యాప్తి పట్ల కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం వైద్యాధికారులతో సమీక్షించారు. ఈ బ్యాక్టీరియా పంట పొలాలు, తేమ ఉన్న ప్రదేశాలలో వ్యాప్తి చెందుతుందని అదేవిధంగా పేడపురుగు నుండి లార్వాలు వ్యాప్తి చెంది కీటకాలుగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఇది కుట్టిన వెంటనే 5 సార్లు జ్వరం రావడంతో పాటుగా తలనొప్పి బద్ధకంగా ఉంటుందన్నారు. అదేవిధంగా శ్వాస తీసుకోవడం ఇబ్బం దిగా మారుతుందన్నారు. ఇది కుట్టినచోట నల్లని మచ్చ ఏర్పడుతుందని సాధారణ యాంటీవైరస్ మందుల ద్వారా నివారించుకోవచ్చునన్నారు. శరీరాన్ని కప్పి ఉంచేలా దుస్తులు ఒంటినిండా ధరించాలని సామాజిక పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత విధిగాపాటించాలన్నారు. నేలపై నిద్రించుట అంత శ్రేయస్కరం కాదని మంచం మీద నిద్రించాలన్నారు. ఇది కుట్టిన వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలన్నారు. స్క్రబ్ టైపస్ బ్యాక్టీరియా సోకిన వెంటనే వైద్యులను సంప్రదించి తీసుకుంటే ప్రమాదం ఉండదని ప్రజలు భయభ్రాంతులకు గురి కావద్దని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్ర మంలో డిఎం అండ్ హెచ్ ఓ దుర్గారావు దొర, అదనపు డి ఎం అండ్ హెచ్ ఓ భరత లక్ష్మి, డి సి హెచ్ ఎస్ కార్తీక్, డాక్టర్ ప్రతాప్, రాపిడ్ రెస్పాన్స్ టీం డాక్టర్లు తిరుమలరావు, అరుణకు మారి, శ్రీనివాస్, జాన్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పెద్దాపురం ఎస్ఐ వి మౌనిక అన్నారు. పెద్దాపురం మహారాణి కళాశాలలో విద్యార్థులకు చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పెద్దాపురం ఎస్ఐ వి మౌనిక ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో డ్రగ్స్, ర్యాగింగ్, గంజాయి, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, సైబర్ నేరాలు వాటి వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. క్రమ శిక్షణతో యువత బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఎక్కడైనా పాఠశాలలు, కళాశాల సమీపాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కొంగోడులో పరిశుభ్రతపై అధికారులు పర్యవేక్షణ

### - మన గ్రామ శుభ్రత మనందరి బాధ్యత : ఎంపీడీవో శ్రీనివాస్



**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం కొంగోడు గ్రామంలో పరిశుభ్రత పనులపై ఎంపీడీవో జటావల్లభుల శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు మంగళవారం పర్యవేక్షించారు. గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణపై అవగాహన సదస్సును ఏర్పాటు చేసి, గ్రామస్థులకు పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామస్తులు ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్లపై లేదా డ్రైనేజీల్లో వేయకుండా ప్రత్యేకంగా భద్రపరచాలని సూచిం చారు. ఒకసారి వాడే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిం చాల్సిన అవసరం ఉందని గుర్తించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందిస్తే గ్రామం మరింత శుభ్రంగా ఆరోగ్యకరంగా మారుతుందన్నారు. తదనంతరం గ్రామంలోని సంపద సృష్టి కేంద్రాలను సందర్శించారు. తడి, పొడి చెత్తను వేరు చేయడం ద్వారా పునర్వినియోగ అవకాశాలు పెరుగుతాయని ఇది పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని చెప్పారు. గ్రామ పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, శుభ్రమైన గ్రామాల ద్వారానే ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# బేబమ్మ డ్యాన్స్.. ఇది ఎవరు గుర్తించలేదే..!



ఉప్పెన సినిమాతో తెలుగులో సూపర్ హిట్ అందుకున్న బేబమ్మ అలియాస్ కృతిశెట్టి తెలుగులో వరుస ఫ్లాపులు ఫేస్ చేస్తుండగా కోలీవుడ్‌లో మాత్రం అమ్మడికి మంచి అవకాశాలు వస్తున్నాయి. కోలీవుడ్ స్టార్ కార్తితో వా వాతియార్ సినిమా చేసింది కృతి శెట్టి. ఈ సినిమాను తెలుగులో అన్నగారు వస్తారు టైటిల్‌తో రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా ఈవెంట్ లో కార్తి కృతి శెట్టిపై చేసిన కామెంట్స్ వైరల్ అయ్యాయి. కృతి శెట్టి తొలి సినిమా ఉప్పెన నుంచి ఇప్పటివరకు తెలుగులో 10 సినిమాల దాకా చేయగా అమ్మడిలో ఉన్న స్పెషల్ టాలెంట్‌ని మన మేకర్స్ గుర్తించలేదు. కార్తి మాత్రం కృతి శెట్టిలోని ఆ టాలెంట్ గుర్తించాడు. ఈవెంట్‌లో మాట్లాడుతూ కృతి శెట్టి డ్యాన్స్ బాగా చేస్తుందని. తనతో మాత్రం సెకండ్ మీటర్ లో చేయి మిగతా 3, 4 ఇంటి దగ్గర పెట్టిరా అని చెప్పానని సరదాగా మాట్లాడారు కార్తి. కృతిశెట్టి యాక్టింగ్ గురించి అందరు చెప్పారు కానీ ఆమె డ్యాన్స్ గురించి ఎవరు ఇప్పటి వరకు ఇలా చెప్పలేదు. అందరు అమ్మడి రోల్స్ మీద రొటీన్ అంటూ కామెంట్ చేయడమే కానీ ఆమెలోని ఈ డ్యాన్స్ టాలెంట్‌ని ఎంకరేజ్ చేయట్లేదు. కనీసం కృతి శెట్టి డ్యాన్స్ గురించి ఎవరు ఇప్పటివరకు ప్రస్తావించిన సందర్భాలు లేవు. కానీ కార్తి స్పెసిఫిక్‌గా కృతి శెట్టి డ్యాన్స్ గురించి చెప్పడంతో అందరు కృతిలోని ఈ టాలెంట్‌ని మనవాళ్లు ఎందుకు వాడుకోలేదని అంటున్నారు. కృతి శెట్టి కోలీవుడ్ ప్రయత్నాలు ఒకదానికి మించి మరొకటి అనేలా ఉన్నాయి. వా వాతియార్‌తో పాటు రవి మోహన్‌తో జినీ, ప్రదీప్ రంగనాథన్ తో ఎల్.ఐ.కె చేస్తుంది కృతి శెట్టి. అన్నగారు వస్తారు సినిమాతో మరోసారి తెలుగు ఆడియన్స్ ముందుకు వస్తుంది కృతి శెట్టి. మరి కార్తి చెప్పినట్టుగా ఆమె డ్యాన్స్ పెర్ఫార్మెన్స్ బాగుంటే మాత్రం తెలుగులో డ్యాన్స్ ప్రధానంగా అయినా కృతికి అవకాశాలు ఇస్తారేమో చూడాలి. కృతి శెట్టి కూడా తెలుగులో మళ్లీ బిజీ అవ్వాలని తెగ ప్రయత్నాలు చేస్తుంది. ఉప్పెన సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న కృతి శెట్టి ఆ తర్వాత వరుస ఆఫర్లు అందుకుంది. ఐతే ఆ టైంలో అన్ని వర్క్ అవుట్ అవుతాయనే ఉద్దేశ్యంతోనే కృతి శెట్టి ఆ సినిమాలు చేసింది.

ఐతే బ్యాడ్ లక్ వల్ల సినిమాలన్నీ వరుసగా నిరాశ పరుస్తూ వచ్చాయి. ఐతే కోలీవుడ్‌లో మాత్రం ఈసారి పకడ్బందీ ప్లానింగ్‌తో వెళ్తుంది కృతిశెట్టి. కార్తి సినిమా హిట్ పడితే అక్కడ బోణీ తెరిచినట్టే. ఇక ప్రదీప్ లాంటి యూత్ హీరోతో నటించడంతో తమిళ్‌లో ఆమెకు మరిన్ని ఛాన్స్‌లు వస్తాయని చెప్పొచ్చు.

# ఫంకీ పాప.. నెక్స్ట్ ఏం చేస్తుందో..?



డ్రాగన్ సినిమాతో యూత్ ఆడియన్స్‌లో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది కయదు లోహర్. అమ్మడు తెలుగులో శ్రీ విష్ణుతో అల్లూరి సినిమా చేసింది. ఆ టైంలో అసలు మన ఆడియన్స్ ఆమెను గుర్తించలేదు కానీ ప్రదీప్ రంగనాథన్ డ్రాగన్ హిట్ అవ్వడంతో కయదుకి తెలుగులో సూపర్ పాపులారిటీ వచ్చింది. వెంటనే అమ్మడికి విశ్వక్ సేన్ ఫంకీ సినిమాలో ఛాన్స్ ఇచ్చారు. అనుదీప్ కెవి డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఫంకీ సినిమాలో కయదు లోహర్ గ్లామర్‌తో పాటు యాక్టింగ్‌లో కూడా ఇంప్రెస్ చేస్తుందని అంటున్నారు. ఫంకీ టీజర్‌తోనే ఆడియన్స్‌ని ఇంప్రెస్ చేయగా సినిమా తప్పకుండా అంచనాలను అందుకునేలా ఉంటుందని చెబుతున్నారు. ఐతే కయదు లోహర్ ఫంకీ తర్వాత నెక్స్ట్ టాలీవుడ్ మూవీ ఏదన్నది ఇంకా క్లారిటీ రాలేదు. అసలైతే రవితేజతో ఒక సినిమా చేస్తుందన్న టాక్ వచ్చింది. కానీ అందులో నిజం లేదని తేలింది. రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తిలో కయదు నటిస్తుందని అన్నారు కానీ ఆ మూవీలో కయదు లోహర్ ప్లేస్ కాలేదు. ఫంకీ పాప ఆ సినిమా రిలీజ్ తర్వాత నెక్స్ట్ ఆఫర్ ఎంచుకోవాలని చూస్తుందో ఏమో కానీ విశ్వక్ సినిమా ఒక్కటి మాత్రమే తెలుగులో చేస్తుంది కయదు లోహర్. ఐతే ఆడియన్స్‌లో ఆమెకున్న హాట్ ఇమేజ్‌కి తెలుగులో ఎలా లేదన్నా ఒక ఐదారు సినిమాలు వెంట వెంటనే పడేలా ఉన్నాయి. ఐతే ఫంకీ హిట్ పడితే ఆ ఛాన్స్‌లు వస్తాయని చెప్పొచ్చు. ఫంకీలో కూడా కయదు తన గ్లామర్ షోతో ఆడియన్స్‌ని బుట్టలో వేసే ప్రయత్నాలు చేస్తుందని తెలుస్తుంది. విశ్వక్‌సేన్ కూడా ఫంకీతో ఒక మంచి సక్సెస్ అందుకోవాలని చూస్తున్నాడు. అనుదీప్ డైరెక్షన్‌లో సినిమా కాబట్టి మినిమం గ్యారెంటీ ఉన్నట్టే. కయదు కూడా అల్లూరి తర్వాత తెలుగులో చేస్తున్న సినిమా కాబట్టి ఈ మూవీతో డబల్ క్రేజ్ తెచ్చుకోవాలని చూస్తుంది. అదే జరిగితే మాత్రం ఫంకీతో కయదు తెలుగులో మళ్లీ బిజీ అయ్యే ఛాన్స్ ఉంటుంది.


కయదు ఓ పక్క తమిళ్‌లో కూడా దూసుకెళ్తుంది. అమ్మడు తమిళ్‌తో పాటు తెలుగులో తనకున్న క్రేజ్ ని క్యాష్ చేసుకునే ప్రయత్నాలు చేస్తుంది. ఫంకీ హిట్ పడితే మాత్రం తెలుగులో కయదు బిజీ అయ్యే ఛాన్స్ కచ్చితంగా ఉంది. ఎలాగు టాలీవుడ్‌లో హీరోయిన్స్ విష యంలో ఎప్పుడు లోటు ఉంటుంది. స్టార్ హీరోయిన్స్ పాన్ ఇండియా సినిమాలతో బిజీ అవుతుండగా యువ హీరోలకు సరైన జోడీ కుదరట్లేదు. ఐతే ఇప్పుడు కయదు అలాంటి వారికి ఫస్ట్ ఆప్షన్ అయ్యేలా ఉంది. ఫంకీ సక్సెస్‌తో తెలుగులో రెండో ఇన్నింగ్స్ అదరగొట్టేయాలని చూస్తుంది అమ్మడు.

# తల్లైన తర్వాత తొలిసారి క్రేజీ లుక్.. ఫ్యాన్స్ ఫిదా!



సాధారణంగా కొంతమంది హీరోయిన్స్ వివాహం అయిన తర్వాత సినిమాలకు బ్రేక్ తీసుకుంటే.. మరికొంతమంది తల్లిదండ్రులైన తర్వాత బ్రేక్ తీసుకుంటారు. ఇంకొంతమంది పెళ్లయి, పిల్లలు పుడితే శాశ్వతంగా ఇండస్ట్రీకి దూరమవుతున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పటి జనరేషన్ హీరోయిన్స్ మాత్రం ఒకవైపు ప్రెగ్నెంట్‌గా ఉన్నా..మరొకవైపు సినిమాలలో చేస్తూ అందరిని ఆశ్చర్యపరుస్తున్నారు. ఇప్పటికే ఆలియా భట్, దీపికా పదుకొనేలాంటి సెలబ్రిటీలు ప్రెగ్నెన్సీలో కూడా నటించి నటనపై తమకున్న మక్కువను నిరూపించారు. ఇంకొంతమంది తల్లిదండ్రులైన కొన్ని రోజులకే సినిమా షూటింగ్లో పాల్గొని అభిమానులను కూడా ఆశ్చర్యపరుస్తున్నారు. ఇంకొంతమంది అభిమానులను ఆకట్టుకోవడానికి తల్లిగా మారిన తర్వాత తమ గ్లామర్ ఫోటోలను సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేస్తూ ఆశ్చర్యపరుస్తున్న విషయం తెలిసిందే. అలాంటి వారిలో కియారా అద్వానీ కూడా ఒకరు. ఈ ఏడాది రామ్ చరణ్ సరసన గేమ్ ఛేంజర్, హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కాంబినేషన్లో వచ్చిన వార్ 2 చిత్రాలలో నటించింది. ఈ రెండు చిత్రాలు కూడా భారీ బడ్జెట్ చిత్రాలే కావడం విశేషం. కానీ రెండు కూడా డిజాస్టర్‌గా నిలిచాయి. అయితే ఆమె ప్రెగ్నెంట్ కావడంతో ఈ సినిమా తాలూకు ఫలితాలు ఆమెను మరింతగా నిరాశపరచలేదనే వార్తలు వ్యక్తం అవుతూ ఉండడం గమనార్హం. ఇకపోతే పండంటి బిడ్డకు జన్మనిచ్చిన కియారా అద్వానీ.. కొంతకాలంగా సోషల్ మీడియాకి కూడా గ్యాప్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు చాలా రోజుల తర్వాత తల్లి అయిన తొలిసారి ఇన్స్టాగ్రామ్ వేదికగా కొన్ని కూల్ ఫోటోలను పంచుకుంది. అందులో ఆరెంజ్ కలర్ డ్రెస్ ధరించిన ఈమె.. ఈ బాడీ కాన్ అవుట్ ఫిట్‌తో అందరి హృదయాలను దోచుకుంది. ముఖ్యంగా మిర్రర్ ముందు స్టైలిష్‌గా ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ఈ ఫోటోలకు క్యాప్షన్‌గా.." చివరికి నాకు ఒక రాత్రి ఫ్రీగా దొరికింది. ఈ రాత్రిని నన్ను ఆస్వాదించనివ్వండి" అంటూ క్యాప్షన్ జోడించింది.. ప్రస్తుతం ఆరంజ్ కలర్ అవుట్ ఫిట్‌లో కియారా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో చాలా వైరల్‌గా మారుతున్నాయి. అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవ్వడమే కాకుండా తల్లి అయిన తర్వాత కూడా కియారాలో ఎటువంటి మార్పులు రాలేదు సో క్యూట్ అంటూ కామెంట్లు చేస్తున్నారు. కియారా అద్వానీ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం కన్నడలో యష్ హీరోగా నటిస్తున్న టాక్సిక్ అనే సినిమాలో హీరోయిన్గా నటిస్తోంది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చిలో విడుదల కాబోతున్న విషయం తెలిసిందే. ఇక విడుదలకు కేవలం మూడు నెలలు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో షూటింగ్లో తిరిగి పాల్గొనబోతోంది అనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. ఏదేమైనా కియారా అద్వానీకి సంబంధించిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

# తరుణ్ కోసం ముందే కర్చీఫ్ వేసిన ఈషా!



తెలుగమ్మాయి ఈషారెబ్బా గురించి పరిచయం అవసరం లేదు. టాలీవుడ్‌లో అమ్మడి కెరీర్ హీరోయిన్‌గా ప్రారంభమైంది. కానీ ఆ దిశగా బిజీ కాలేకపోయింది. దీంతో స్టార్ హీరోల చిత్రాల్లో సహాయక పాత్రల్లోనూ ప్రవేశించింది. ప్రస్తుతం అమ్మడి జర్నీ రెండు రకాలుగా కొనసాగుతుంది. హీరోయిన్ ఛాన్స్ అయినా? హీరోయిన్ ఫ్రెండ్ రోల్ అయినా ఒకే అంటూ కెరీర్‌ని ముందుకు తీసుకెళ్తుంది. అలాగే వెబ్ సిరీస్ ల్లోనూ నటిస్తోంది. అలా ఇండస్ట్రీలో ఖాళీ లేకుండా పని చేస్తోంది. నటిగా తాను పెట్టాల్సిన ఎఫెర్ట్ అంతా పెడుతుంది. అయితే హీరోయిన్‌గా వెండి తెరపై కనిపించి రెండేళ్లు దాటిపోయింది. చివరగా సుధీర్ బాబు హీరోగా నటించిన 'మామమశ్చంద్ర'లో నటించింది. ఆ తర్వత మళ్లీ ఇంత కాలానికి 'ఓం శాంతి శాంతి శాంతి హీ' అనే చిత్రంలో తరుణ్ భాస్కర్‌కు జోడీగా నటిస్తోంది. ఇది పరభాషా రీమేక్ చిత్రం. ఇదే అదునుగా అమ్మడు తరుణ్ దర్శకత్వంలో నటించాలంటూ ముందుగానే కర్చీఫ్ వేసేసింది. తన పక్కనే హీరోయిన్‌గానే కాదు...దర్శకత్వంలో అవకాశం ఇచ్చి కూడా ప్రోత్సహించాలంటూ ఓపెన్ అయింది. మరి అవకాశం అడిగిన నటి కోసం తరుణ్ ఛాన్స్ ఇస్తాడా? లేదా? అన్నది చూడాలి. అదే వేదికపై తరుణ్ ఛాన్స్ ఇస్తానని గానీ, ఇవ్వనని గానీ ఎలాంటి ప్రకటనా చేయలేదు. ప్రస్తుతం తరుణ్ భాస్కర్ కూడా దర్శకత్వం పక్కన బెట్టి నటుడిగా కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. దర్శకుడిగా చివరిగా 'కీడా కోలా' తెరకెక్కించాడు. ఇది రెండేళ్ల క్రితం రిలీజ్ అయింది. ఆ తర్వాత నటుడిగా బిజీ అయ్యాడు. ఈ రెండేళ్ల కాలంలోనే ఐదారు సినిమాలు చేసాడు. అలాగని డైరెక్టర్‌గా అవకాశాలు లేక నటుడిగా టర్న్ తీసుకోలేదు. పెళ్లి చూపులు విజయంతో డైరెక్టర్‌గా ఎలాంటి గుర్తింపు దక్కిందో తెలిసిందే. అటుపై ఈ నగరానికి ఏమైంది అంటూ మరో విజయం అందుకున్నాడు. కానీ డైరెక్టర్‌గా కంటే నటుడిగా ఎక్కువ సంపాదిస్తున్నాడు. డైరెక్టర్‌గా ఏడాది మహా అయితే రెండు సినిమాలు చేయగలడు. కానీ నటుడిగా ఒకే ఏడాది ఎన్ని సినిమాలైనా చేయడానికి అవకాశం ఉంటుంది. అందుకే ఫేం ఉండగానే దున్నుకోవాలి అన్న చందంగా తరుణ్ నట ప్రయాణం కొనసాగిస్తున్నాడు. అలాగే డైరెక్టర్‌గా కొన్ని కథలు కూడా సిద్ధం చేసి పెట్టుకున్నాడు. యువ హీరోలు పని చేయడానికి సిద్ధంగా ఉన్నారు. వచ్చే ఏడాది ఆ సినిమాల గురించి ఆలోచించే అవకాశం ఉంది. అందుకేనేమో ఈషా రెబ్బా తెలివిగా ముందే ఛాన్స్ అడిగేసింది.

# విజయనగరం జిల్లాలో గ్రామీణ రోడ్లు బ్రిడ్జిల నిర్మాణానికి రూ. 84.62 కోట్లతో పనుల మంజూరు : రాష్ట మంత్రి "కొండపల్లి" శ్రీనివాస్

**- జిల్లాలో 67 పనులను మాంజూరు చేసిన రాష్ట ప్రభుత్వం - సుదీర్ఘ కాలంగా పెండింగ్లో ఉన్న బ్రిడ్జిల నిర్మాణానికి అనుమతులు మంజూరు - కార్యరూపం దాల్చిన రాష్ట ముఖ్యమంత్రి హామీ**



**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లాలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ఉన్న గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనుందని, గత ప్రభుత్వ హయాంలో మరమ్మత్తులకు నోచుకోని పంచాయతీరాజ్ రోడ్లను నిర్మించేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకం స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్స్ (సాస్కి) నిధులతో జిల్లా వ్యాప్తంగా 67 పనులకు రూ. 84.62 కోట్లతో జిల్లాలో రోడ్లను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన పరమైన అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా బొబ్బిలి నియోజకవర్గంలోని 8 పనులకు, చీపురుపల్లి నియోజకవర్గంలో 10 పనులకు, గజపతినగరం నియోజకవర్గంలో 7 పనులకు, నెల్లిమర్ల నియోజకవర్గంలో 17 పనులకు, రాజాం నియోకవర్గంలో 6 పనులకు, ఎస్ కోటలో 7 పనులకు, విజయనగరంలో 12 పనులకు అనుమతులు దక్కాయని, ఈ నిధులతో రహదారులు, బ్రిడ్జిలను అభివృద్ధి చేసేందుకు పరిపాలనపరమైన ఉత్తర్వులు వెలుపడ్డాయని ఆయన తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారుల అభివృద్ధి పథకం (ఏ పీ ఆర్ ఆర్ ఎస్ పి) పథకం కింద ఈ పనులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వటం సంతోషించాల్సిన విషయం అని ఆయన తెలియజేశారు. ఈ పనుల్లో భాగంగా గజపతినగరం నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న పనులకు పరిపాలన పరమైన అనుమతులు రావటం సంతోషించాల్సిన విషయమన్నారు. ఇటీవల గజపతినగరం నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన జామి మండల పరిధిలోని శాసనపల్లి పెదవేమలి మధ్య సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న హై లెవెల్ వంతేన నిర్మాణ పనులకు, గజపతినగరం మండలం ఆంధ్ర ఆర్ అండ్ బి రోడ్ నుంచి మద్రివలస మధ్య రహదారితోపాటు బ్రిడ్జి నిర్మాణ పనులకు అనుమతులు రావడం పట్ల ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. విజయనగరం జిల్లా పరిధిలో ఇంతపెద్ద ఎత్తున రహదారులు, బ్రిడ్జి నిర్మాణ పనులకు అనుమతులు రావడం వెనక రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నేత నారా లోకేష్ చొరవ ఎంతో ఉందని, వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఈ ప్రకటనలో వివరించారు.

# వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జోరుగా కోటి సంతకాల సేకరణ



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండలంలోని వెంకటాపురం గ్రామంలో మంగళవారం నాడు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జోరుగా సాగింది. ఈ నెల పదో తేదీన కోటి సంతకాల ప్రతులను జిల్లా కార్యాలయానికి పంపించాల్సి ఉండడంతో ఈ కార్యక్రమాన్ని గ్రామ వైకాపా నాయకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉధృతంగా చేపట్టారు. వెంకటాపురంలో గల ఇంటింటికి వెళ్లి సంతకాలు సేకరించడంతోపాటు, గ్రామంలో గల జూనియర్, డిగ్రీ కళాశాల వద్ద కూడా విద్యార్థుల నుంచి సంతకాలు సేకరణ ముమ్మరంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, సర్పంచ్ బెల్లన త్రినాధరావు, గేదెల జగదీష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రహదారి భద్రతపై అవగాహన సదస్సు

**- ప్రమాదాల నివారణకై, ట్రాఫిక్ నిబంధనలు పాటించండి - మద్యం సేవించి వాహనాలు నడిపినా, అతివేగంగా, బాధ్యతారాహిత్యంగా నడిపినా కఠిన చర్యలు తప్పవు : సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.ఏ.వి.రమణ, సబ్ ఇన్స్పెక్టర్ కే.కిరణ్ కుమార్ నాయుడు**





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ ఆదేశాల మేరకు సి.ఐ జి.ఏ.వి రమణ ఆధ్వర్యంలో స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మంగళవారం నాడు ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా సి.ఐ జి.ఏ.వి రమణ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిబంధనలను అతిక్రమిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అంతేకాకుండా మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, ముందు సీటులో ప్రయాణకులను కూర్చోబెట్టవద్దన్నారు. అతివేగంగా, బాధ్యతారాహిత్యంగా వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సి.ఐ రమణ హెచ్చరించారు. నిబంధనలకు లోబడి వాహనాలు నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భారతమ్మకి శుభాకాంక్షలు తెలిపిన సిరమ్మ





**తగరపువలస, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ సతీమణి వైయస్ భారతి జన్మదిన వేడుకలు క్యాంప్ కార్యాలయంలో చిన్న శ్రీను సోల్జర్స్ అద్యక్షురాలు సిరి సహస్ర ముఖ్య అతిథిగా భీమిలి నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా సిరమ్మ కేకు కట్ చేసి భారతి కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ అద్యక్షురాలు సిరి సహస్ర, భీమిలి నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్, కొయ్య వెంకట లక్ష్మి, ఇంజా వరలక్ష్మి, ఏలూరి లత, చిప్పాడ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టులకు భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి

**- సేకరించిన ప్రభుత్వ భూమిని వెంటనే అప్పగించండి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులకు చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, తోటపల్లి, తారకరామ తీర్ధసాగర్ ప్రాజెక్టులు, జాతీయ రహదారి 130 (సిడి), జాతీయ రహదారి 516(బి), కుర్ధారోడ్-విజయనగరం మూడో రైల్వే లైన్, కొత్తవలస-విజయనగరం నాలుగో రైల్వేలైన్ తదితర ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్షించారు. భూసేకరణ ప్రకటన, పరిహారం చెల్లింపు తదితర అంశాలపై ఆరా తీశారు. వీటన్నిటినీ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఈ ప్రాజెక్టుల కోసం సేకరించిన ప్రభుత్వ భూమిని వెంటనే ఆయా శాఖల అధికారులకు అప్పగించాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్, ఆర్డిఓలు డి.కీర్తి, సత్యవాణి, రామ్మోహన్, ఎస్డిసి కళావతి, ఏపిఈపిడిసిఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, ఇరిగేషన్ ఈఈ వెంకటరమణ, ఉద్యాన, అటవీ, ఎయిర్పోర్ట్, యూనివర్సిటీ, ఆర్ అండ్బి, రైల్వే తదితర శాఖల అధికారులు, తాహసీల్దార్లు, డిటిలు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణపై పత్రికా సమావేశం






**ఆనందపురం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నేపథ్యంలో భీమిలి నియోజకవర్గం ఆనందపురం వైఎస్ఆర్సిపి కార్యాలయంలో పత్రికా సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని విజయనగరం జిల్లా వైఎస్ఆర్ సీపీ పార్టీ అధ్యక్షుడు, జిల్లా జడ్పీ చైర్మన్, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) తన కుమార్తె సిరిసహస్ర (సిరిమ్మ)తో కలిసి నిర్వహించారు. చిన్న శ్రీను మాట్లాడుతూ, కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంగా జరుగుతోందని తెలిపారు.

ఈ నెల 10న నియోజకవర్గ కేంద్రాల నుంచి సంతకాల పత్రాలు జిల్లా కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో పంపిస్తామని, తర్వాత 15న జిల్లా కేంద్రాల నుంచి పార్టీ ప్రధాన కార్యాలయానికి తరలిస్తామని చెప్పారు. అక్కడి నుంచి 17వ తేదీన గవర్నర్కు అందజేయనున్నట్టు వివరించారు. భీమిలి నియోజకవర్గంలో సేకరించిన సంతకాల పత్రాలను 10వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు తగరపువలస అంబేద్కర్ విగ్రహం నుంచి వైఎస్ఆర్ విగ్రహం వరకు ర్యాలీగా తీసుకెళ్లి జిల్లా కేంద్రానికి పంపే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ బాధ్యతదారులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళా ప్రతినిధులు, సోషల్ మీడియా బృందం, ప్రజాసంఘాలు కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోతన హనుమంతు, సుంకరి గిరిబాబు, గండిగుండం శ్రీను, మజ్జి వెంకటరావు, రాంబాబు, పోతన శ్రీను, కోరాడ లక్ష్మణ్, గాడు శ్రీను, కోరాడ ముసలి నాయుడు, దాము, రౌత్ శ్రీను, పాండ్రంగి శ్రీను, రాంబాబు, ఎస్. రాంబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

# బ్రెయిన్ యోగా ఒక అద్భుతం

**- అంతర్జాతీయ బ్రెయిన్ యోగా గురువు పిడుగు శ్రీనివాసులు**



**విజయనగరం, (రాజధాని వార్తలు):** బ్రెయిన్ యోగా ఒక అద్భుతమని బెంగళూరుకు చెందిన ప్రముఖ బ్రెయిన్ యోగ గురువు, అంతర్జాతీయ శిక్షకులు పిడుగు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో గురజాడ పబ్లిక్ స్కూల్లో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, మానసిక స్పష్టతను పెంచడం, ఆందోళనను తగ్గించడం, నాడీ వ్యవస్థను ఉత్తేజపరచడం, మెదడుకు రక్త ప్రసరణను పెంచడం మరియు న్యూరోన్ల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడం వంటివి బ్రెయిన్ యోగతో సాధ్యమని అన్నారు. ఈ సందర్భంగా వివిధ ముద్రాలతో బ్రెయిన్ ఎక్సర్సైజ్లను విద్యార్థులతో చేయించడమే కాక వాటి విశిష్టతను విపులంగా వివరించారు. ఈ సందర్భంగా యోగా గురువు పిడుగు శ్రీనివాసులను, రోటరీ లీడ్ ఇండియా చైర్మన్ దుర్గా బాలాజీ, పాఠశాల ప్రిన్సిపాల్ పూడి శేఖర్లతో కలిసి గురు ప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ లీడ్ ఇండియా ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ చైతన్య, జగదీష్, లత తదితరులు పాల్గొన్నారు.

# ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ అమలుపై మంత్రి కొండపల్లి సమీక్ష




**విజయనగరం, (రాజధాని వార్తలు):** గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలని, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) సద్వినియోగం చేసుకుని గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) అమలు జరుగుతున్న తీరును మంత్రి ఆ శాఖ అధికారులతో సమీక్షించారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకం మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా చేపట్టిన పనులను పురోగతిపై ఈ సమావేశంలో చర్చించారు. ఇప్పటికే ఈ పథకం కింద చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపు, పెండింగ్ బిల్లుల స్థితి ఆయా పనుల పురోగతిపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. ఈ సమావేశంలో డుమా పిడి శారదాదేవి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్, విజయనగరం ఈఈ రత్నకుమార్, బొబ్బిలి ఈ.ఈ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** నిర్దిష్ట లక్ష్యాలను అదిగమించడంలో ప్రముఖ పాత్రను పోషించిన 41వ వార్డు అధ్యక్షులు కోడిగుడ్ల శ్రీధర్, కార్పొరేటర్ పూర్ణిమ వార్డు ప్రజల నుంచి భారీగా సేకరించిన సంతకాల పత్రాలను నియోజకవర్గం సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్‌కు అందించిన శ్రీధర్ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేక రణ కార్యక్రమంలో విశాఖ 41 వ వార్డు అరుదైన ఘనతను సాధించింది. మెడికల్ కళాశాల ప్రైవేటు కళాశాలకు వ్యతిరేకంగా చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వార్డులో విస్తృత స్థాయిలో నిర్వహించిన అనూహ్య రీతిలో సంతకాలను సేకరించడంలో 41వ వార్డు అధ్యక్షులు శ్రీధర్ రికార్డు సృష్టించారు. ప్రజల నుంచి సేకరించిన పత్రాలను వాసుపల్లికి అందించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో కూటమి నేతలు కూడా పాల్గొని తమ సంతకాల ద్వారా ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను వ్యక్తం చేశారని గుర్తు చేశారు. తమ వార్డు నుంచే భారీ స్థాయిలో స్పందన వచ్చిందని, చంద్రబాబు ప్రభుత్వానికి భవిష్యత్‌లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ, దేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గ ఇంచార్జి కేవి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈ రోజు ఉదయం కాంగ్రెస్ పార్టీ అదినేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కేవీ సూర్యనారాయణ మాట్లాడుతూ సోనియా గాంధీ కాంగ్రెస్ పార్టీకి చేసిన త్యాగాలను, పార్టీని నడిపించే విధానాన్ని కొనియాడారు. తను ఇటలీ కి చెందింది అనే విదేశీ ముద్ర బీజేపీ వేస్తుందని, అయిన ఆమె భారతీయురాలిగా రాజీవ్ గాంధీని వివాహం చేసుకొని ఏనాడో ఇక్కడ ఒక భారతీయురాలిగా స్థిరపడి తన రాజకీయ చతురతతో పార్టీని ముందుండి నడిపిస్తున్నారని తన బిడ్డలు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ తల్లికి తోడుగా ఎల్లప్పుడూ అండగా ఉంటూ పార్టీ కార్యకలపాలని కొనసాగిస్తూ పార్టీని క్రియాశీలకంగా ముందుకు తీసుకువెళ్తున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసిసి ప్రధాన కార్యదర్శి వంకర ఆనంద్ కుమార్, ఇచ్చాపురం ఇంచార్జి చక్రవర్తి, ఎస్సీ సెల్ నాయకులు కస్తూరి వెంకట రావు, జాయింట్ సెక్రటరీ కొండపల్లి శ్రీనివాస రావు, కాకర అప్పారావు, మొల్లి సీతారామ్ ఇతర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజాతీర్పుకు కూటమి ప్రభుత్వం తల వంచాలి : మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన తీర్పును కూటమి ప్రభుత్వం గౌరవించి వెంటనే వెనక్కి తీసుకోవాలని మాజీ శాసనసభ్యులు, పశ్చిమ నియోజక వర్గ వైసిపి సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ డిమాండ్ చేశారు.

మంగళవారం రాత్రి మిందిలోని పశ్చిమ నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో, మాజీ శాసనసభ్యులు, పార్టీ పరిశీలకులు చింతలపూడి వెంకటరామయ్య సమక్షంలో, పశ్చిమ నియోజకవర్గంలోని 14 వార్డుల నుంచి ప్రజల వద్ద నుంచి సేకరించిన కోటి సంతకాల పత్రాల బాక్సులను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమక్షంలో బహిర్గతం చేశారు. ఈ సందర్భంగా మళ్ల విజయ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 14 వార్డుల ప్రజల నుంచి సేకరించిన సంతకాల పత్రాలను జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు కె.కె రాజుకి అధికారికంగా అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం వాటిని అధిష్టానానికి పంపి ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వానికి చేరవేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, వార్డు పార్టీ పరిశీలకులు, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, నియోజకవర్గ, వార్డు అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నగరంలో అనధికార నిర్మాణ భవనాలు తొలగింపు

## - జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకర్ రావు





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు నగరం లో ఆగస్టు 31, 2025 తర్వాత నిర్మించిన అనధికార భవన నిర్మాణాలను తొలగించడం జరుగుతుందని జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకర్ రావు మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. నగరంలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బిపిఎస్ పథకంలో నమోదు కొరకై పలు భవన నిర్మాణ దారులు నూతనంగా భవనాలను, అదనపు అంతస్తులను అనధికా రంగా నిర్మాణం జరుపుతున్నారని అటువంటి వాటిని గుర్తించి పట్టణ ప్రణాళిక విభాగం నిరంతరం నిఘా ఏర్పాటు చేసి అనధి కారంగా నిర్మిస్తున్న భవనాలను కూల్చివేయడం జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ 8, 9 తేదీలలో పలు జోన్‌ల యందు సం బంధిత జోనల్ కమిషనర్లు, సహాయ ప్రణాళిక అధికారులు, పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది, సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో పలు అనధికార భవనాలను తొలగించడం జరిగిం దని తెలిపారు. 2వ జోన్‌లో 5, 6 వార్డుల పరిధిలో చినగదిలి, పీఎం పాలెం తదితర ప్రాంతాలలో 3 నిర్మాణాలు, 3వ జోన్‌లో 22, 25 వార్డులలో శివాజీ పాలెం సీతమ్మధార తదితర ప్రాం తాలలో 2 నిర్మాణాలు, 4వ జోన్‌లో 28, 37 వార్డుల పరిధిలోని అల్లిపురం, మహారాణిపేట తదితర ప్రాంతాలలో 3 నిర్మాణాలు, 5వ జోన్‌లో 42, 49 వార్డులలో దొండపర్తి పరిసర ప్రాంతాలలో 4 నిర్మాణాలు, 6వ జోన్ 70, 88 వార్డుల పరిధిలోని గాజువాక, జగ్గరాజుపేట ప్రాంతాలలో 3 నిర్మాణాలు, 8వ జోన్ 57వ వార్డు బుచ్చిరాజుపాలెంలో 1 నిర్మాణంతో కలిపి మొత్తం 16 అనధికార నిర్మాణాలను గత రెండు రోజుల నుండి తొలగించడం జరిగిందని తెలిపారు. తేదీ ఆగస్టు 31, 2025 తర్వాత నిర్మించిన అనధికార భవన నిర్మాణాలు ప్రస్తుతం అనధికారికంగా జరుగుతున్న నిర్మాణాలకు బిపిఎస్ పథకం వర్తించదని, కావున అనధికారికంగా అక్రమ భవన నిర్మాణాలు, అదనపు అంతస్తుల నిర్మాణాలకు భవన నిర్మాణదారులు, బహుళ అంతస్తుల నిర్మాణదారులు పాల్పడరాదని ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి హెచ్చరించారు. ప్రభుత్వం కల్పించిన ఎల్ ఆర్ ఎస్, బిపిఎస్ పథకాల సదవకాశాన్ని సద్వినియోగపరుచుకునేందుకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం టౌన్ ప్లానింగ్ విభాగం ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసిందని హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్లు 9154282649, 9154282654 లకు ఫోన్ చేయడం గాని లేదా గుర్తింపు పొందిన లైసెన్స్ టెక్నికల్ పర్సన్ ద్వారా 2025 ఆగస్టు 31వ తేదీ లోపల నిర్మించిన అనధికార భవనాల కట్టడాలను క్రమబద్ధీకరించుకునేందుకు భవన యజమానులు ముందుకు రావాలని ఆయన తెలిపారు.

# అవినీతి నిర్మూలనపై జీవీఎంసీ కమిషనర్ ఉక్కుపాదం

## - జీవీఎంసీలో అవినీతిరహిత విధానం దిశగా చర్యలు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థలో అవినీతి నిర్మూలనకు తావు లేకుండా, అవినీతి రహిత విధానం అమలు దిశగా కఠిన చర్యలు చేపట్టడం జరుగుచున్నదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. జీవీఎంసీలో అవినీతి నిర్మూలన దిశగా కఠినమైన విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తున్నామని, జీవీఎంసీలో ఎవరైనా అవినీతికి పాల్పడినట్లయితే కఠిన చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవడం జరుగునని కమిషనర్ తెలిపారు. ఇప్పటికే పలు ఆరోపణలపై ఒక ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ సేవలను సరెండర్ చేశామని, ఒక సహాయక ఇంజనీర్‌పై విచారణకు ఆదేశాలు జారీ చేసామని, ఒక టీపీవో సేవలను కూడా సరెండర్ చేయడం జరిగిందని తెలిపారు. పౌర సేవల్లో పారదర్శకత, నిష్పాక్షికత కోసం జీవీఎంసీ ఎటువంటి అవినీతి చర్యలను ఉపేక్షించదని కమిషనర్ స్పష్టం చేశారు. అవినీతిలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హితవు పలికారు. జీవీఎంసీ అధికారులు, ఇంజనీర్లు, ఉద్యోగులు, సిబ్బంది అవినీతి రహితంగా, విశాఖ నగర అభివృద్ధి దిశగా చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందించాలని ఆదేశాలు జారీ చేయడమైనదని కమిషనర్ తెలిపారు.

# పార్టీ కోసం కష్టించి పని చేసే వారికే తగిన గుర్తింపు

## - గనగల్ల రామరాజు, గుంటు ఆనంద్‌లను సత్కరించిన వాసుపల్లి

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వైసీపీ పార్టీలో కష్టపడి పనిచేసే కార్యక ర్తలకే తగిన గుర్తింపు లభిస్తుందని విశాఖ దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. జిల్లా జనరల్ సెక్రటరీ గనగల్ల రామరాజు, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా గుంటూ ఆనంద్ పదవులు వచ్చిన సందర్భంగా ఆశీలమెట్ట కార్యా లయంలో మంగళవారం వాసుపల్లి గణేష్ కుమార్ సత్కరించారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థా యిలో వైసీపీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కష్టించి పనిచేయాలని చెప్పారు. భవిష్యత్తు వైసిపి పార్టీదేనని వెల్లడించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తప్పుబట్టాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని దుయ్యబట్టారు.తమ పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని తెలిపారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో వైసిపికి మంచి రోజులు రానున్నా యని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, తదితర సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై 48వ వార్డులో పర్యటించిన గంకల కవిత అప్పారావు యాదవ్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ 48వ వార్డు కొండవాలు ప్రాంతంలో 48వ వార్డు కార్పొరేటర్, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ భారతీయ జనతా పార్టీ ఫ్లోర్ లీడర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ గంకల కవిత అప్పారావు మంగళవారం నాడు ఉదయం నుంచి రాత్రి వరకు పై ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భం గా ఇటీవల మర మ్మతులు చేసిన విద్యుత్ దీపాలు పనితీరును పర్యవేక్షించారు. వార్డులో రోడ్లు ఆవశ్యకత గల ప్రాంతాలను పరిశీలించి వాటి కోసం కౌన్సిల్‌లో చర్చిస్తామని, వీధి దీపాలు వెలగని ప్రాంతాలను గుర్తించి సంబంధిత అధికారితో మాట్లాడి పరిష్కారం చూపమని కోరారు. ఈ సందర్భంగా మంచి నీటి కుళాయి సమస్యపై సంబంధిత అధికారితో మాట్లాడి పరిష్కారం చూపమని, నేషనల్ హైవే ప్రాంతంలో పారిశుధ్య పనులు చేయాలనీ అధికారులను కోరారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మిస్తున్న రోడ్లు, కాలు వలను పరిశీలిస్తూ,కొండ వాలు ప్రాంత ప్రజలు ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డులో 24×7 కోసం తవ్విన గుంతలను పూడ్చాలని, రోడ్లు, కాలువలు మరమ్మత్తులకు గురి అయ్యాయని వాటి స్థానంలో నూతనంగా నిర్మించాలని ప్రజలు నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. త్వరలో ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని గంకల హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గంకల కవిత అప్పారావు యాదవ్ మాట్లాడుతూ 48 వ వార్డులో సమస్యలపై పర్యటన చేయడం జరిగిందని వార్డులో ఉదయం నుంచి రాత్రి వరకు పర్యటన చేసి ప్రజలు సమస్యలు పై పిర్యాదు స్వీకరించడం జరిగిందని, అందులో కొన్ని తక్షణమే పరిష్కారం చూపడం జరిగిందని, మరి కొన్ని విషయాలు పై పరిష్కారం చూపమని అధికారులను కోరడమైనదని, కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదని వచ్చిన పిర్యాదుపై రాత్రి వరకు గ్రామంలో పర్యటన చేసి పని చేయని వీధి దీపాలను గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కారం చూపమని కోరడమైనదని అన్నారు. ఈ సందర్భంగా వార్డులో ప్రజలకు ఉన్న సమస్యలపై పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చిన అన్నారు. వార్డు ప్రజలకు ఏ సమస్య వచ్చిన అన్ని వేళలో అందుబాటులో ఉంటానని ఇటువంటి సమస్య వచ్చినా తక్షణమే తనను సంప్రదించాలని గంకల కవిత అప్పారావు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాత్రివేళలో వార్డులో పర్యటన చేసి ప్రజల కష్టాలను తెలుసుకున్నటువంటి గంకల కవిత అప్పారావు యాదవ్ పని తీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేసారు.

# అండర్ 17 ఫుట్‌బాల్ పోటీలకు విక్రమ్ జూనియర్ కళాశాల విద్యార్థి

**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** అంతర్ రాష్ట్ర అండర్ 17 ఫుట్‌బాల్ బాయ్స్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు నాయుడుపేట పట్టణంలోని విక్రమ్ జూనియర్ కళాశాల విద్యార్థి హీరోల్డ్ క్రిష్టి మనోహర్ ఎంపికయ్యారు. పల్నాడు జిల్లా నరసారావుపేటలో మూడు రోజులు జరిగిన అండర్ 17 ఫుట్‌బాల్ బాయ్స్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ఇందుకూరు హీరోల్డ్ క్రిష్టీ మనోహర్ అంత ర్రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. నాయుడుపేట పట్టణంలోని విక్రమ్ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ ఎంపిసి చదువు తున్న విద్యార్థి హీరోల్డ్ క్రిష్టీ మనోహర్ అండర్ 17 ఫుట్‌బాల్ బాయ్స్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపిక కావడంతో కోచ్ షేక్ గౌస్ బాషా, అసిస్టెంట్ కోచ్ నాని, విక్రమ్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జె.విజ యబాబు రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తు ఆ విద్యార్థికి అభినందనలు తెలియజేసారు. 2026 జనవరి 11వ తేదీ హర్యానాలోని పానిపట్టులో జరగనున్న అంతర్రాష్ట్ర అండర్ 17 ఫుట్‌బాల్ పోటీల్లో తమ క్రీడాకారుడు ఇందుకూరు హీరోల్డ్ క్రిస్టియన్ మనోహర్ పాల్గొంటారని కోచ్ షేక్ గౌస్ బాషా తెలియజేసారు.

# "పెసా" చట్టం ద్వారా పరిపాలన జరగాలి

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** గిరిజన ప్రాంతాల్లో "పెసా" చట్టంపై అవగాహన పెంచి, ఆ చట్టం ప్రకారం పరిపాలన జరిగేలా చూడాలని సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఉప ప్రిన్సిపల్ జి రమణ పిలుపునిచ్చారు.

పెసా చట్టంపై ఏజెన్సీ ప్రాంత ఐదు జిల్లాలలోని ఎంపీడీఓలకు ఒక రోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. త్వరలో డిప్యూటీ ఎంపీడీవోలకు, ఎంవోటిలుగా మండలానికి నలుగురు వంతున ఇక్కడ శిక్షణ ఇచ్చి తదుపరి మండల స్థాయిలో విస్తృత శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో పరిపాలన మరింత మెరుగుపడేలా శిక్షణలు ఉండాలని రమణ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుశీల, ఫ్యాకల్టీ సభ్యులు చిన్నబ్బులు, నిహారిక, రాజశ్రీ, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# తిరుమల పరకామణి చోరీ కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు




**అమరావతి, (రాజధాని వార్తలు):** తిరుమల పరకామణి చోరీ కేసులో ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. చోరీ కేసులో ఎస్వీఆర్ నమోదు చేసి చట్టప్రకారం తగిన చర్యలు తీసుకొనేందుకు సీఐడీ, ఏసీబీ డీజీలకు హైకోర్టు వెసులుబాటు కల్పించింది. చోరీ కేసు లోక్ అదాలత్ వద్ద రాజీ వ్యవహారంతో పాటు నిందితుడు రవికుమార్ ఆస్తులపై దర్యాప్తు కొనసాగించాలని సీఐడీ, ఏసీబీ డీజీలకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసేందుకు సేకరించిన సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని సీఐడీ, ఏసీబీ డీజీలకు సూచించింది. టీటీడీ అప్పటి ఏవీఎస్వో వై.సతీష్ కుమార్ పోస్టుమార్టం సర్టిఫికేట్‌ను సీల్డ్ కవర్లో రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు అందజేయాలని సీఐడీని ఆదేశించింది. కేసు దర్యాప్తులో భాగంగా సేకరించిన సమాచారాన్ని అవసరమైన మేరకు ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌తో పంచుకోవాలని స్పష్టీకరించింది. సీఐడీ, ఏసీబీ డీజీలు దాఖలు చేసిన నివేదికలను పరిశీలించిన అనంతరం హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను హైకోర్టు ధర్మాసనం ఈనెల 16కు వాయిదా వేసింది.

# 18 నెలల తర్వాత.. గుడివాడలో కొడాలి నాని ప్రత్యక్షం



**కృష్ణా జిల్లా, (రాజధాని వార్తలు):** సుదీర్ఘ విరామం తర్వాత క్రియాశీల గుడివాడ రాజకీయాల్లో మాజీ మంత్రి కొడాలి నాని ప్రత్యక్షమయ్యారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో ఆయన పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత పార్టీ కార్యక్రమంలో తొలిసారి పాల్గొన్నారు కొడాలి. ఎన్నికల్లో ఓటమి, అనారోగ్య సమస్యలతో దాదాపు 18 నెలలుగా ప్రత్యక్ష రాజకీయాలకు మాజీ మంత్రి దూరంగా ఉన్న విషయం తెలిసిందే. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న కొడాలి నాని.. గవర్నర్‌కు అందించే వినతి పత్రంలో సంతకం చేశారు. ఆపై వినతి పత్రాలను జిల్లా కమిటీకి అందించే పార్టీ శ్రేణుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన పార్టీ శ్రేణులతో కొడాలి నాని ఉత్సాహంగా మాట్లాడారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులకు వైద్య విద్య అందాలనే మంచి సంకల్పంతో మాజీ సీఎం జగన్‌మోన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలో ఏర్పాటుకు పునుకున్నారని కొడాలి నాని అన్నారు. వైసీపీ పాలనలో ఐదు కళాశాలలు పూర్తి చేయగా... మరో ఐదు కళాశాలల నిర్మాణం తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. పేద ప్రజలు, విద్యార్థులకు ఉపయోగపడే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, హాస్పిటల్స్ ప్రైవేటీ కరణ దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ కుట్రను అడ్డుకునేందుకు మాజీ సీఎం జగన్ ప్రజలతో కలిసి పోరాటాన్ని మొదలుపెట్టారన్నారు. తాము తలపెట్టిన ఉద్యమానికి ప్రజల నుంచి చక్కటి స్పందన వచ్చిందని చెప్పారు. ప్రజల విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాభిష్టానికి అనుకూలంగా వ్యవహరించాలని కేంద్రాన్ని కోరనున్నట్లు తెలిపారు. ఉద్యమంలో తాము సేకరించిన వినతి పత్రాలను వైసీపీ అధినేత జగన్ నాయకత్వంలో గవర్నర్‌కు అందజేయనున్నట్లు మాజీ మంత్రి కొడాలి నాని పేర్కొన్నారు.

# సర్పంచ్‌ల నిర్లక్ష్యంపై పవన్ కళ్యాణ్ సీరియస్



**అమరావతి, (రాజధాని వార్తలు):** పంచాయతీరాజ్ సిబ్బంది విషయంలో పలువురు సర్పంచ్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సిబ్బందితో మాటా మాంతీ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారంటూ పవన్ దృష్టికి పంచాయతీ రాజ్ సిబ్బంది తీసుకెళ్లారు. నెలంతా కష్టపడి పని చేసినా జీతాలు, బిల్లుల విషయంలో కొన్ని చోట్ల సర్పంచ్‌లు ఇబ్బందులు పెడుతున్నారని.. సకాలంలో సంతకాలు చేయకపోవడంతో జీతాలు కూడా అందడం లేదని తెలియ జేశారు. సర్పంచ్‌లు చెప్పిన విధంగా పంచాయతీ సెక్రటరీలు పని చేస్తూ సిబ్బందిని, కార్మికులను ఇబ్బందులు పెడుతున్నారని పంచాయతీ రాజ్ సిబ్బంది పవన్‌కు తెలిపారు. దీనిపై వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం.. నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్న సర్పంచ్‌ల జాబితా సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక నుంచి పని చేసిన వారికి ఎక్కడా జీతాలు ఆగకుండా సకాలంలో అందేలా చర్యలు ఉంటాయని హామీ ఇచ్చారు. హెచ్చరికలు చేసిన తరువాత కూడా సర్పంచ్‌లు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# వైకుంఠ ఏకాదశి ప్రత్యేక దర్శన ఏర్పాట్లపై పోలీసు టిటిడి సమీక్ష



**తిరుపతి, (రాజధాని వార్తలు):** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమలలో భక్తుల రద్దీ,భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, సేవా కార్యకలాపాలపై సమగ్ర సమీక్షించడం జరిగింది. తిరుమల అన్నమయ్య భవన్‌లో జరిగిన ఈ ఉన్నతస్థాయి సమన్వయ సమావేశాన్ని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, మరియు టిటిడి విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీకృష్ణ, సంయుక్తంగా నిర్వహించారు. సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి నాడు భారీగా ఉండే భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్యూలైన్ నిర్వహణ, ట్రాఫిక్ మానిటరింగ్, లడ్డూ ప్రసాదం పంపిణీ కేంద్రాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్, అలిపిరి, శ్రీనివాసం తదితర కీలక ప్రదేశాల్లో అదనపు సిబ్బందితో పర్యవేక్షణ బలోపేతం చేయాలని ఆదేశించారు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా భక్తులకు నిరంతర అవగాహన కల్పించాలని కూడా సూచించారు. భద్రతా చర్యల్లో భాగంగా యాక్సెస్ కంట్రోల్ పాయింట్లు, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు, డ్రోన్ పర్యవేక్షణను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేసి 24 గంటల మానిటరింగ్ కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులను తప్పుదారి పట్టిస్తూ టోకెన్లు ఇప్పిస్తామని మోసపూరిత చర్యలకు పాల్పడుతున్న దళారులు, జీప్ డ్రైవర్లపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రామకృష్ణ, రామకృష్ణచారి, శ్రీనివా సులు, కులశేఖర్, శ్రీనివాసరావు, డీఎస్పీలు వెంకటనారాయణ, ప్రసాద్, విజయ్ శేఖర్, చంద్రశేఖర్, అలాగే సి.ఐలు, ఆర్.ఐలు, టిటిడి విజిలెన్స్ అధికారులు, ఆక్టోపస్, ఆర్టీఓ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan